



# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV
ప్రజా వీక్షణం టీవి

Subscribe


www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :210 24 బుధవారం, జూన్ 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari


## హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు
# గ్రీన్ సిగ్నల్

- కేంద్రమంత్రులతో సిఎం రేవంత్ చర్చలు ఫలప్రదం
- ఖట్టర్ నివాసంలో కిషన్ రెడ్డితో కలసి భేటీ
- మెట్రో రైలుపై చర్చల్లో కీలక పురోగతి





న్యూఢిల్లీ,జూన్23 (ప్రజా వీక్షణం)

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులతో జరిపిన వరుస సమావేశాలు విజయవంతమయ్యాయి. మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్-2 విస్తరణ పనుల్లో ఉన్న అన్ని ప్రధాన ఆటంకాలు ఈ చర్చలతో తొలగిపోయాయి. మంగళవారం ఉదయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నతస్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్, జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మిగతా 2 లో

### హర్ముజ్ జలసంధిలో
## రికార్డు స్థాయిలో ఆయిల్ రవాణా

- ట్రంప్ ప్రకటన

- హర్మూజ్ జలసంధిలో ఒక్కరోజే 19 మిలియన్ బ్యారెళ్ల ఆయిల్ రవాణా
- ఇరాన్‌తో ఒప్పందం వల్లే ఇది సాధ్యమైందని ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్

02



# కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

## - గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి





### స్టాక్ మార్కెట్లలో భారీ పతనం...
## కీలక రంగాల షేర్లు డీలా

- మంగళవారం భారీ నష్టాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

(ప్రజా వీక్షణం)

ప్రతికూల సంకేతాల మధ్య దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలతో ముగిశాయి. మిగతా 2 లో



## ఇందిరమ్మ రాజ్యమంటూ పేదల ఇళ్ల కూల్చివేత

- పేదల ఇళ్లను లాక్కుంటున్న రెవెన్యూ మంత్రి
- ఖమ్మం పర్యటనలో మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

ఖమ్మం,జూన్23 (ప్రజా వీక్షణం)

సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ఇందిరమ్మ రాజ్యమంటూనే పేదల ఇళ్లు కూల గొడుతోందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



## రేవంత్ కోరారు.. కేంద్రమంత్రులను కలిసాం

- ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి వెల్లడి




న్యూఢిల్లీ,జూన్23 (ప్రజా వీక్షణం)

ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, మంగళశారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ సమావేశమయ్యారు.ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్ రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు.'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండుసార్లు నాకు లేఖ రాశారు.

### వైకాపా కుల,కుట్ర రాజకీయాలు
# తిప్పి కొట్టాలి

- ప్రతి అంశంపైనా అవగాహన పెంచుకోవాలి
- మంత్రులకు చంద్రబాబు సూచన



అమరావతి,జూన్23 (ప్రజా వీక్షణం)

కేబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. క్రిమినల్స్‌ను వైసీపీ వెనకేసుకొస్తూ రాజకీయం చేస్తోందన్నారు. వైసీపీ నేతలు కుల మీటింగ్‌లు పెడుతూ కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రల్ని దీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.కర్నూలులో ఇటీవల చోటుచేసుకున్న ఘటనను ప్రస్తావించిన సీఎం, గ్రామస్థులే బహిష్కరించిన వ్యక్తులకు వైసీపీ మద్దతుగా నిలవడం విచారకరమని వ్యాఖ్యానించారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అనవసర వివాదాల్లోకి లాగేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి సందర్భాల్లో కూటమి ఐక్యతను చాటే విధంగా మంత్రులంతా స్పందించాలని సూచించారు.



## పాఠశాలలు, అంగన్‌వాడీలకు నిరంతర నీటి సరఫరా

- స్వచ్ఛ భారత్ మిషలన్ లక్ష్యాలపై కీలక సూచనలు
- అధికారలుతో అభివృద్ధి, సంక్షేమాలపై మంత్రి సీతక్క సమీక్ష

హైదరాబాద్,జూన్23 (ప్రజా వీక్షణం)

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతర నీటి సరఫరా ఉండాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధనపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులకు సూచనలు చేశారు. మిగతా 2 లో

## 8 మంది రెబెల్ ఎమ్మెల్యేలపై వేటు వేసిన మమతా బెనర్జీ

- మమతా బెనర్జీ స్థానంలో పార్టీ కొత్త అధ్యక్షుడిని ప్రకటించిన రెబల్ వర్గం
- మరుసటి రోజే 8 మంది కీలక నేతలపై వేటు వేసిన మమత
- టీఎంసీలో తార స్థాయికి చేరిన అంతర్గత పోరు




(ప్రజా వీక్షణం)

తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు తార స్థాయికి చేరింది. 1998లో పార్టీని స్థాపించి, దశాబ్దాలుగా ఏకఛత్రాధిపత్యంగా నడిపిస్తున్న అధినేత్రి మమతా బెనర్జీ స్థానంలో కొత్త అధ్యక్షుడిని ప్రకటిస్తూ రెబల్ వర్గం సంచలన నిర్ణయం తీసుకుంది. దీనికి రివర్స్ కౌంటర్‌గా మమతా బెనర్జీ 8 మంది రెబల్ ఎమ్మెల్యేలపై వేటు వేశారు. మిగతా 2 లో

## నీట్‌తో విద్యార్థుల్లో గందరగోళం

- హిందీ మనకు అసవరం లేదు
- తమిళం, ఇంగ్లీస్ సరిపోతుంది
- కుటుంబ పార్టీలకు తాము వ్యతిరేకం- ప్రజలంతా తమ కుటుంబమనే భావనతో పాలన
- ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఇక్కడికి వచ్చా
- ప్రజల సంపూర్ణ మద్దతుతో అధికారం చేపట్టాం - కరూర్ తొక్కిసలాట ఘటన మరచిపోలేని విషాదం- అసెంబ్లీలో సిఎం విజయ్ కీలక ప్రసంగం



చెన్నై,జూన్23 (ప్రజా వీక్షణం)

తమిళనాడు విద్యార్థుల్లో నీట్ అసమానతల్ని సృష్టిస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అన్నారు. అసమానతలకు కారణమైన నీట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం కీలక ప్రసంగం చేశారు. మిగతా 2 లో

ప్రజావీక్షణం దినపత్రిక

ప్రజావీక్షణం దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

## సంపాదకీయం

# దేశంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రం !

దేశంలో రాజకీయాలు అనూహ్య మలుపు తిరుగుతున్నాయి. ప్రధాన పార్టీలన్నీ దంగయిపోతున్నాయి. బెంగాల్ ఫలితాల తరవాత మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తాజాగా ఆమెను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తూ మెజార్టీ ఎమ్మెల్యేలు తీర్మానం చేశారు. ఇక మహారాష్ట్రలో బాలథాక్రే స్థాపించిన శివసేన దాదాపు అంతర్ధానం అయ్యే దుస్థితిలో ఉంది. యూపిలో అఖిలేశ్ పార్టీలో సైతం ముసలం పుట్టింది. ఇదంతా యాధృచ్ఛికంగా జరుగుతన్నదని భావించడానికి లేదు. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు వీగిపోయిన తరవాత అధికార బిజెపి వేస్తున్న ఎత్తులకు ప్రాంతీయ పార్టీలు చిత్తవుతున్నాయి. ఇదే ఆయా పార్టీల పునాదులను పెకిలిస్తోందని భావించాలి. ఇదంతా కూడా మళ్లీ డీ లిమిటేషన్, మహిళా బిల్లును గట్టెక్కించే పనిలో అధికార పార్టీ చేస్తున్న కసరత్తుగానే గుర్తించాలి. ఈసారి ఈ రెండు బిల్లును ఎలాగైనా గట్టెక్కించే పనిలో మోడీ ద్వయంయ ఉన్నట్లుగా అర్థం అవుతోంది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో ముసాయిదాను సిద్ధం చేసినా పార్లమెంట్‌లో తగిన మద్దతు దక్కుతుందన్న నమ్మకం కలిగితేనే ఈ బిల్లును సభ ముందుకు తీసుకురావాలని వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ చట్టం ఆమోదం పొందాలంటే లోక్‌సభ.. రాజ్యసభల్లో మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ సాధించాలి. అంతటితో ఈ పక్రియ పూర్తి కాదు. దేశంలోని కనీసం సగంరాష్ట్రాల శాసనసభలు ఈ బిల్లును ఆమోదించి తీరాల్సి ఉంటుంది. సంఖ్యాబలంపై పూర్తి ధీమా వచ్చాకే ఎన్డీయే సర్కార్ ఈ మహిళా బిల్లును అధికారికంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది. గతంలో జరిగిన అవమానానికి బద్లా తీసుకునే పనిగా కూడా భావిస్తున్నారు. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ల అమలుపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ఈ బిల్లును అమలులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తెరవెనుక పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తోందనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. డీలిమిటేషన్.. సీట్ల పెంపు లాంటి కీలక అంశాలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తూ ఓ సరికొత్త ముసాయిదాను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ వర్షాకాల సమావేశాల్లోనే దీనిని గట్టెక్కించే పనిలో భాగగంఆ బలాన్ని పెంచుకునే ఎత్తులో బిజెపి ఉన్‌ట్లు స్పష్టం అవుతోంది. గతంలో ప్రతగిపాదించినట్లుగానే లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను ఏకంగా 50 శాతం పెంచే ఆలోచనలో మోడీ సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్న డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. ఇటీవల ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు వ్యతిరేకించడంతో అది వీగిపోయింది. బెంగాల్, తమిళనాడు ఎన్నికల తర్వాత విపక్షాల బలం తగ్గడంతో మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. మరింత పకడ్బందీగా 133వ రాజ్యాంగ సవరణను తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. ముఖ్యంగా సీట్ల పునర్విభజన సమయంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి వస్తున్న అభ్యంతరాలకు చెక్ పెట్టేలా ఈ కొత్త ముసాయిదాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ స్థానాల పెంపు వల్ల జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు రాజకీయంగా నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే.. రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తిని 1971 జనాభా లెక్కల ఆధారంగానే కొనసాగించాలని కేంద్రం గట్టిగా భావిస్తోంది. అదే సమయంలో ఒక రాష్ట్రం పరిధిలో నియోజకవర్గాల సరిహద్దుల మార్పునకు మాత్రం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు ప్రచారం సాగుతోంది.ప్రభుత్వం సిద్ధం చేసిన ఈ కొత్త ముసాయిదా లో అత్యంత కీలకమైన అంశం చట్టసభల స్థానాల పెంపు. లోక్‌సభతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను భారీగా పెంచబోతున్నారు. వీలైనంత వరకు అన్ని చోట్లా ఏకంగా 50 శాతం మేర సీట్లను పెంచాలని కేంద్రం భావిస్తోంది.. సాధ్యమైనంత వరకు 50 శాతం పెంపు విధానాన్ని అమలు చేసి.. మహిళలకు తగినన్ని సీట్లు కేటాయించాలని చూస్తున్నారు. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 55, 81, 82తో పాటు 170, 330లకు మార్పులు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో పెండింగ్‌లో ఉన్న డీలిమిటేషన్ బిల్లులో కూడా తగిన సవరణలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్తులో ఏర్పాటు చేయబోయే నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ ఈ కొత్త సూత్రాల ఆధారంగానే తన పనిని కొనసాగించాల్సి ఉంటుంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే ముందుగా సభలో మొత్తం సభ్యుల సంఖ్య పెరగాలి. అప్పుడే సిట్టింగ్ ఎంపీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ సీట్ల పెంపు పక్రియతో కేవలం మహిళలకే కాకుండా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా భారీగా రాజకీయ లబ్ధి చేకూరనుంది. తాజా ప్రతిపాదనల ప్రకారం చూస్తే.. లోక్‌సభలో ఎస్సీ స్థానాలు ప్రస్తుతమున్న 84 నుంచి ఒకేసారి 136కు పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అలాగే ఎస్టీల స్థానాలు కూడా 47 నుంచి 70కి పెరగనున్నాయి. ఈ మార్పు చేయడం ద్వారా లోక్‌సభలో షెడ్యూల్డ్ కులాలకు దక్కాల్సిన పూర్తి 16 శాతం కోటా వారికి అందుతుంది. పెరిగిన ఈ కొత్త స్థానాల్లో మహిళా రిజర్వేషన్లను వర్టికల్ విధానంలో పక్కాగా అమలు చేస్తారని ప్రచారం. అంటే పెరిగిన ఎస్సీ.. ఎస్టీ స్థానాల్లో కూడా మూడో వంతు సీట్లను ఆయా వర్గాలకు చెందిన మహిళలకే కేటాయిస్తారు. ఈ మొత్తం రాజకీయ పక్రియను 2029 సాధారణ ఎన్నికల నాటికి పూర్తి చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. డీలిమిటేషన్ విషయంలో పలు రాష్ట్రాల నుంచి వ్యక్తమవుతున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని.. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపేలా ప్రధానమంత్రి కార్యాలయం ఇప్పటికే ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకుంది. అయితే భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే ఈ భారీ నిర్ణయం అమలు చేయడం ప్రభుత్వానికి అంత సులభం కాదు. దీనికోసం చట్టసభల్లో స్పష్టమైన సంఖ్యాబలం అత్యవసరం. అందుకే ఇప్పుడు ఆయా పార్టీల్లో పగుళ్లు పడుతు న్నాయి. బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో దాదాపు ఆయా ప ఆర్టీలకు వణుకు పుట్టించేలా చీలికలు మొదలయ్యాయి. దీంతో లోక్‌సభలో, రాజ్యసభలో సంపూర్ణ మెజార్టీ కోసం యత్నాలు మొదలయ్యాయని భావించాలి. తమిళనాడులో కూడా డిఎంకె పరోక్షంగా మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు. కాంగ్రెస్‌పై గుర్రుగా ఉన్న ఆ పార్టీ,ఇండి కూటమితో కలసి వెళ్లకపోవచ్చు. మొత్తంగా రానున్న రోజుల్లో ఈ ముఖచిత్రం మరింత స్పష్టంగా ఆవిష్కృతం కానుంది.

# హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి

మెట్రో విస్తరణ, నిధుల సమీకరణ, కేంద్ర-రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిష్ఠాత్మక ఆర్థిక సలహా సంస్థను కన్సల్టెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ రుణ సేకరణపై రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది. ఫేజ్-2 కింద ప్రతిపాదించిన కారిడార్ల నిర్మాణ వ్యయం ఎంత అవుతుంది? నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి? అనే అంశాలపై నివేదిక అందిస్తుంది. ఈ కన్సల్టెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తదుపరి అడుగులు వేస్తాయి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కేంద్రప్రభుత్వ ప్రతినిధితో పాటు తెలంగాణ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమన్వయ సభ్యులుగా వ్యవహరిస్తారు. కేంద్ర నిబంధనల ప్రకారం డీపీఆర్ లలో మార్పులు చేస్తూ, పనుల అనుమతుల పక్రియను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం సులభతరం కానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది. కేంద్రమంత్రి ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో.. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు అప్పులు, రెండో ఫేజ్‌కు అనుమతులు, నిధులు కావాలని సీఎం రేవంత్ కోరినట్లు సమాచారం. సమావేశంలో సీఎస్ రామకృష్ణ రావు, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడుపు తున్నారు. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు. అలాగే, తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గంటకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద జోషిని ఇరువురు మంత్రులు కలవనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని కోరనున్నారు. అనంతరం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సమావేశమై.. యూరియా సరఫరా పెంచాలని మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేయనున్నారు.

# హార్మూజ్ జలసంధిలో రికార్డు స్థాయిలో ఆయిల్ రవాణా: ట్రంప్ ప్రకటన

మొదటిపేజీ తరువాయి

అమెరికా, ఇరాన్‌ల మధ్య ఇటీవల కుదిరిన ఒప్పందం ఆశించిన సత్ఫలితాలనిస్తోందని, హార్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా తిరిగి భారీగా పుంజుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. సోమవారం ఒక్కరోజే ఈ జలసంధి గుండా 1.9 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా జరిగిందని, ఇది ఒక సంచలనాత్మక రికార్డు అని ఆయన ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "నిన్న హార్మూజ్ జలసంధి నుంచి 19 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా అయింది. ఇది ఒక సరికొత్త రికార్డు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రపంచం ఇప్పుడు మరింత సురక్షితమైన ప్రదేశంగా మారింది" అని ఆయన పేర్కొన్నారు. ఈ సానుకూల పరిణామంతో అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు తగ్గాయి. నిరసనలు, తప్పుడు ప్రచారాల ద్వారా అమెరికా విజయాన్ని తక్కువ చేసే ప్రయత్నాలు జరిగినప్పటికీ, భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యకలాపాలపై పారదర్శకతకు ఇది భరోసా ఇస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఇరాన్ ఈ నిబంధనలకు కట్టుబడి ఉండకపోతే, తదుపరి చర్చలకు తావుండదని హెచ్చరించారు. ఇరాన్ చేసిన కొన్ని ప్రతిపాదనల ప్రాతిపదికన, ఎలాంటి దిగ్బంధనం లేకుండా హార్మూజ్ జలసంధిని తెరిచేందుకు తాను అంగీకరించినట్లు ట్రంప్ వివరించారు. ఒకవేళ తిరిగి దిగ్బంధనాన్ని విధిస్తే నౌకల రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోతాయని, అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అటువంటి అవసరం రాకపోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పందంలో భాగంగా అమెరికా విడుదల చేసే నిధులను ఇరాన్ కేవలం ఆహారం, వైద్య సామగ్రి వంటి అత్యవసరాల కోసమే వినియోగించగలదని, వాటిని కూడా కేవలం అమెరికా నుంచే కొనుగోలు చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ సముద్ర వాణిజ్యంలో దాదాపు 20 శాతం చమురు రవాణా సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్ వంటి దేశాల నుంచి హార్మూజ్ జలసంధి ద్వారానే సాగుతుంది. గత కొంతకాలంగా ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలు, దిగ్బంధనాల కారణంగా ఈ మార్గంలో చమురు సరఫరాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడి ధరలు పెరిగాయి. అయితే, తాజా ఒప్పందంలో భాగంగా అణు తనిఖీలకు ఇరాన్ సమ్మతించడంతో ప్రాంతీయ ఉద్రిక్తతలు సద్దుమణిగాయి.

# నీట్‌తో విద్యార్థుల్లో గందరగోళం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా హిందీ వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన వంటి పలు అంశాలను ప్రస్తావించిన విజయ్ విమర్శకులకు గట్టిగా బదులిచ్చారు. ఈ మేరకు అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందీ భాషనూ వ్యతిరేకించారు. తమిళం, ఇంగ్లీష్‌లతో కూడిన ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉంటామన్నారు. నీట్ వల్ల సామాజిక అసమానతలు పెరుగు తున్నాయని సీఎం విజయ్ చెప్పుకొచ్చారు. విద్యార్థులపై తీవ్ర మానసిక ఒత్తిడి తెస్తున్న ఈ పరీక్షను రద్దుచేసి, ఇంటర్ మార్కుల ఆధారంగా వైద్య సీట్లను కేటాయించాలని తమిళనాడు చాలా కాలంగా కోరుతోందని ఆయన గుర్తుచేశారు. హిందీ భాషపైనా స్పందిస్తూ.. తమిళం రాష్ట్ర భాషగా, ఇంగ్లీష్ అంతర్జాతీయ భాషగా సరిపోతాయని తన వైఖరిని స్పష్టం చేశారు. మూడో భాషను బలవంతంగా రుద్దాల్సిన అవసరంలేదని, రెండు భాషల విధానమే కొనసాగుతుందని తేల్చి చెప్పారు. తమ పార్టీని విమర్శించే వారికి ఈ సందర్భంగా గట్టిగా సమాధాన మిచ్చారు సీఎం విజయ్. ప్రజల మద్దతుతోనే తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధికారంలోకి వచ్చిందన్న ఆయన.. దీని వెనుక ఎన్నో కుట్రలు, సవాళ్లను ఎదుర్కొ న్నామన్నారు. 'జనం గుండెల్లో స్థానం సంపాదించడం అంత సులువు కాదు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే ఇక్కడకు వచ్చాం. అయినప్పటికీ కొందరు 'నటుడి పార్టీ' అనే విమర్శలు గుప్పిస్తున్నారు. వాటన్నింటినీ మేం పట్టించుకోం. మా రాజకీయాలు పారదర్శకంగా ఉంటాయని విజయ్ చెప్పుకొచ్చారు. అలాగే కుటుంబ రాజకీయాలపై ఆయన మాట్లాడుతూ.. 'మా రాజకీయాలు ఒక్క కుటుంబం కోసమే కాదు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం మాదే. అదే మా పాలన.. అదే మా లక్ష్యం' అని స్పష్టం చేశారు. ఎన్నో సవాళ్లను దాటి తాము అధికారంలోకి వచ్చామని, నటుడి పార్టీ అని తమను ఎంతోమంది ఎగతాళి చేశారని గుర్తుచేసుకున్నారు. మాకు ఈ అధికారం అంత సులువుగా వచ్చింది కాదు. తమిళనాడు ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు నేను, నా పార్టీ ఎన్నో కుట్రలు, సవాళ్లను అధిగమించాల్సి వచ్చింది. మాది యాక్టర్ పార్టీ అని, నేను సినిమా షూటింగ్ నుంచి నేరుగా సీఎం కుర్చీలో కూర్చున్నానని చాలా మంది గేలి చేశారు. అలాంటి విమర్శలు నేను పట్టించుకోను. సాధారణంగా చాలా మంది రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్లోకి వెళ్తారు. కానీ, నేను ప్రజల్లోకి వెళ్లిన తర్వాత పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేశా. నాపై నమ్మకం ఉంచి ప్రజలు గెలిపించారని విజయ్ అన్నారు. తమిళనాడులో ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉన్నట్లు సీఎం పునరుద్ఘాటించారు. హిందీ భాషను రుద్దేందుకు కేంద్రం చేస్తోన్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు.

# కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

మొదటిపేజీ తరువాయి

న్యూఢిల్లీ,జూన్23 (ప్రజా వీక్షణం)



కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# 8 మంది రెబెల్ ఎమ్మెల్యేలపై వేటు వేసిన మమతా బెనర్జీ

మొదటిపేజీ తరువాయి

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ తన మాజీ రైట్ హ్యాండ్, మాజీ మంత్రి ఫిర్హాద్ హకీమ్‌తో పాటు మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేలను పార్టీ నుంచి మమత శాశ్వతంగా బహిష్కరించారు. బహిష్కరణకు గురైన వారిలో ఫిర్హాద్ హకీమ్, జావేద్ అహ్మద్ ఖాన్, అరూప్ రాయ్ (రెబల్స్ ప్రకటించిన కొత్త ప్రెసిడెంట్), రథిన్ ఘోష్, బిప్లబ్ మిత్ర, సబీనా యాస్మిన్, స్నేహాశిష్ చక్రవర్తి, మాజీ మంత్రి అరూప్ బిశ్వాస్ ఉన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో మొత్తం ఉన్న టీఎంసీ ఎమ్మెల్యేల్లో మెజారిటీ నేతలు తమవైపే ఉన్నారని తిరుగుబాటు వర్గం చెబుతోంది. మొత్తం 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేల్లో 60 మంది సపోర్ట్ తమకే ఉందని రెబల్స్ ప్రకటించారు.

# పాఠశాలలు, అంగన్‌వాడీలకు నిరంతర నీటి సరఫరా

మొదటిపేజీ తరువాయి

గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలపై మంత్రి సీతక్క రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలతో మంత్రి సమావేశమయ్యారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్ష చేశారు. ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, జీపీ కార్యాలయాల నిర్మాణాలపై సమీక్షించారు. జల సంరక్షణ పనులు, చెక్‌డ్యాంల నిర్మాణాలపై అధికారులతో మంత్రి చర్చలు జరిపారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎమ్‌కేఎస్‌వై) పనుల అమలుపై మంత్రి సమీక్ష జరిపారు. గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరుపై సీతక్క ఆరా తీశారు. పారిశుధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై చర్చించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపైనా సమీక్ష చేశారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులపై పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. మహిళా సంఘాల బలోపేతం, బ్యాంక్ లింకేజీల పెంపుపై సెర్ప్‌తో చర్చించారు. పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

# స్టాక్ మార్కెట్లలో భారీ పతనం... కీలక రంగాల షేర్లు డీలా

మొదటిపేజీ తరువాయి

మెటల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ (పీఎస్‌యూ) షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాల ఒత్తిడితో సూచీలు కుప్పకూలాయి. రోజంతా ఒడుదొడుకులకు లోనైన మార్కెట్లు చివరికి నష్టాల్లోనే స్థిరపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 893.39 పాయింట్లు నష్టపోయి 76,200.68 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 278.80 పాయింట్లు పతనమై 23,824.10 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీనతలు దేశీయ ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో అన్ని రంగాల్లోనూ అమ్మకాలు వెల్లువెత్తాయి. నిఫ్టీలో ఇన్ఫోసిస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టీసీఎస్ వంటి షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 3 శాతానికి పైగా పతనమై అత్యధికంగా నష్టపోయింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2 శాతానికి పైగా క్షీణించగా, పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ కూడా డీలా పడింది. బ్రాడర్ మార్కెట్లోనూ ఇదే ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.05 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.48 శాతం చొప్పున నష్టపోయాయి.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- సమాజ సేవకురాలు బండ్రెడ్డి రజని

బాపట్ల : జూన్ 23 (ప్రజా వీక్షణం)



పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటలని సమాజ సేవకురాలు బండ్రెడ్డి రజని పేర్కొన్నారు.బాపట్ల పట్టణంలోని ఆంజనేయ అగ్రహారం మునిసిపల్ ప్రాధమిక పాఠశాలలో మంగళవారం పచ్చదనం – పరిశుభ్రత – మొక్కల పెంపకం అనే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం అలవాటు చేసుకోవాలని అన్నారు.మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.సేవా దృక్పథం అలవర్చుకోవాలని తెలియజేశారు. పాఠశాల ఆవరణలో మామిడి,నిమ్మ,జామ మొక్కలను నాటారు.అనంతరం విద్యా ర్థులకు నోటు పుస్తకాలు,పెన్నులు,స్కెల్స్ మరియు అల్పాహారంను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రీ ప్రైమరీ పాఠశాల లో విద్యార్థులను చేర్పించండి

దేవరకద్ర జూన్ 23 ప్రజా వీక్షణం

దేవరకద్ర మండలంలో ఈ విద్యా సంవత్సరం నుండి నూతనంగాప్రారంభించబడిన ప్రీ ప్రైమరీ పాఠశాల ల్లో విద్యార్థులను చేర్పించాలని మంగళవారం తల్లిదండ్రులకు మండల విద్యాధికారి పి బలరాం సూచించారు. మండలంలో నూతన ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రాథమిక పాఠశాల దేవరకద్ర, యుపిఎస్ వెంకటాయపల్లి, యుపిఎస్ జీనుగురాల, ప్రాథమిక పాఠశాల డోకూరు, ప్రాథమిక పాఠశాల నార్లోని కుంట్ల, గ్రామాలలో ప్రాథమిక పాఠశాలలు మంజూరు అయినవి అని తెలిపారు.మూడు, నాలుగు, ఐదు సంవత్సరాలు వయసుగల చిన్నారులను మీ సమీప ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు ఈ పాఠశాలల్లో నర్సరీ ఎల్కేజీ యూకేజీ తరగతులతో పాటు చిన్నారుల వయసుకు అనుగుణంగా నాణ్యమైన బోధన అభ్యాస వాతావరణం కల్పిస్తున్నట్లు తెలిపారు విద్యార్థులు తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నేటి వరకు ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో 72 మంది విద్యార్థులు నమోదు అయినారు అని మండల విద్యాధికార తెలిపారు.



## బాపట్ల పట్టణంలో మునిసిపల్ కమీషనర్ హాసిని విస్తృత పర్యటన

బాపట్ల : జూన్ 23 (ప్రజా వీక్షణం)

బాపట్ల పురపాలక కమీషనర్ మామిళ్లపల్లి హాసిని మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి త్రాగునీటి సరఫరా,అభివృద్ధి పనులు,అన్న క్యాంటిన్,వీధి కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రాన్ని పరిశీలించారు.త్రాగునీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.భీమావారిపాలెంలో రహదారి పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.అన్న క్యాంటిన్ లో ఆహార నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.రైలుపేటలోని వీధి కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రాన్ని సందర్శించి జంతు సంక్షేమ ప్రమాణాలను పాటించాలని సూచించారు.6వ వార్డులో డ్రైనేజీ సమస్యలను పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందికి ఆదేశించారు.ప్రజలకు అవసరమైన పౌర సేవలు అందించడం పురపాలక సంఘం లక్ష్యమని కమీషనర్ హాసిని తెలిపారు.






# బ్రహ్మోస్ వస్తే.. భారీ ఉపాధి..

- దేవరకద్ర కు మహర్దశ..

- డి ఆర్ డి ఓ ప్రాజెక్టు వెనుక ఎమ్మెల్యే జిఎంఆర్ కృషి..

దేవరకద్ర జూన్ 23 ప్రజా విక్షణం

దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో బ్రహ్మోస్ క్షిపణి తయారీ వస్తే ఉపాధి మరింత పెరుగుతుందని దానివలన దేవరకద్ర కు మహర్దశ రాబోతుంది. డి ఆర్ డి ఓ ప్రాజెక్టు వెనుక దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి మధు సూదన్ రెడ్డి కృషి ఎంతో ఉన్నది. పాలమూరు జిల్లా,దేవరకద్ర నియోజక వర్గం,దేవరకద్ర మండలంలో తయారీ యూనిట్.400 ఎకరాలు ఉచితంగా కేటాయిస్తామన్న టీజిఐఐసీ కేంద్ర రక్షణ శాఖ మంత్రి , సీఎం రేవంత్ భేటీలో చర్చకు రావడంతో పెరిగిన ఆశలు.. దేవరకద్ర నియోజకవర్గం, దేవరకద్ర మండలంలోని బస్వాయపల్లి – చౌదర్ పల్లి గ్రామాల మధ్య 400 ఎకరాల ప్రభుత్వ భూమి అందు బాటులో ఉంది.ఉచితంగా అప్పగిం చేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది.టీజిఐఐసీ నుంచి కూడా ఈమేరకు రక్షణ శాఖకు లేఖ రాశారు.గత ఏడాది బ్రహ్మోస్, డి ఆర్ డి ఓ సంస్థలకు చెందిన ఉన్నతాధి కారులు దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంర్ తో కలిసి చౌదర్ పల్లి భూముల్లో పర్యటించారు.బ్రహ్మోస్ క్షిపణుల పరిశోధన ,తయారీకి ఈ ప్రాంతం అనుకూలమే అని సంకేతాలు ఇచ్చారు.ప్రత్యక్షంగా పరోక్షంగా ఐదు వేల మందికి ఉపాధి దక్కే అవకాశం.అదనంగా మరో 100 ఎకరాలు అవసరమైతే కూడా భూ సేకరణ సులువుగా పూర్తవుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.ఈ యూనిట్ల ఏర్పాటుకు చొరవ తీసు కోవాలని సీఎం రేవంత్ రెడ్డి కి దేవర కద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్



రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనికి ఏమైనా చర్చిం చారు. అందుకు రక్షణ శాఖ మంత్రి దేవరకద్ర నియోజకవర్గంలో బ్రహ్మోస్ క్షిపణి తయారీ ఏర్పాటుకు కృషి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు సీఎం తెలిపారు. రక్షణ శాఖ మంత్రి హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డికి, కృతజ్ఞతలు తెలిపారు.

# కుల రాజకీయాలకు కాలం చెల్లింది కూటమి నేత రాంబాబు హెచ్చరిక

- తోట త్రిమూర్తులు నిర్వహించింది ఆత్మీయ సభ కాదు.. 'రాజకీయలినిరుద్యోగుల సభ

- కాపులపై ప్రేమతో కాదు .. స్వార్థం కోసమే వైకాపా సభలు: కాల్నీడి రాంబాబు ద్వజం

కాకినాడ, జూన్ 23:లి(ప్రజా వీక్షణం)

తోట త్రిమూర్తుల ఆధ్వర్యంలో ఇటీవల కాకినాడ జిల్లాలో వైసీపీ కాపు నేతలు నిర్వహించిన సభ కాపుల ఆత్మీయ సమావేశం కాదని, అది కేవలం 'రాజకీయ నిరుద్యోగుల సభ' మాత్రమే నని తెలుగుదేశం పార్టీ కాపు సీనియర్ నాయకులు కాల్నీడి రాంబాబు తీవ్ర స్థాయిలో విమర్శించారు. మంగళ వారం ఆయన మీడియాతో మాట్లా డుతూ వైసీపీ నేతల తీరుపై ధ్వజ మెత్తారు.వైసీపీ నాయకులకు కాపులపై ఎలాంటి ప్రేమ లేదని, కేవలం తమ రాజకీయ లబ్ధి కోసమే ఇటువంటి డ్రామాలు ఆడుతున్నారని ఆరోపిం చారు.వైసీపీకి తెలిసింది కేవలం కుల రాజకీయాలు మాత్రమేనని కాల్నీడి రాంబాబు మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడైనా దురదృష్టవశాత్తూ మరణం సంభవిస్తే... అక్కడికి వెళ్లి మృతుడి కులం ఏమిటో తెలుసుకుని, దాని ఆధారంగా రాజకీయం చేయడం వైసీపీకి అలవాటుగా మారిందని ఆయన ఆక్షేపించారు."రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ అధ్యక్షులు రామ్ మాధవ్ వాస్తవాలు మాట్లాడుతుంటే వైసీపీ నేతలు ఎందుకు భుజాలు తడుము కుంటున్నారో ప్రజలందరికీ అర్థమవు తోంది." అంటూ టీడీపీ కాపు నేత కాల్నీడి రాంబాబు మండిపడ్డారు. ప్రజలను మభ్యపెట్టే ఇటువంటి కుల




రాజకీయాలను రాష్ట్ర ప్రజలు ఇకపై నమ్మే పరిస్థితిలో లేరని రాంబాబు స్పష్టం చేశారు. కేవలం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ముందుకు సాగు తోందని, ప్రజల శ్రేయస్సే తమ మొదటి ప్రాధాన్యతని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

## వైసీపీది 'రాజకీయ నిరుద్యోగుల' సభ.. కాపులపై ప్రేమ కానే కాదు

- రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ ఘాటు విమర్శలు

కాకినాడ, జూన్ 23:(ప్రజా వీక్షణం)

కాకినాడ జిల్లా పరిధిలో ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కాపు సామాజికవర్గ నాయకులు నిర్వ హించిన సమావేశంపై తెలుగుదేశం పార్టీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. అది ఏమాత్రం కాపుల ఆత్మీయ కలయిక కాదని, పూర్తిగా 'రాజకీయ నిరుద్యోగుల సభ' అంటూ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ తీవ్ర స్థాయిలో విమర్శించారు.వైసీపీ నేతలకు కాపులపై ఎలాంటి నికార్సయిన ప్రేమ లేదని, కేవలం కోల్పోయిన రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే ఇలాంటి డ్రామాలు వేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ అధినాయకత్వానికి, ఆ పార్టీ నేతలకు కేవలం కుల రాజకీయాలు చేయడం మాత్రమే వచ్చని తోట లక్ష్మీ నారాయణ మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడైనా అవాంఛనీయ ఘటన జరిగి ఎవరైనా మరణిస్తే, కనీస మానవత్వం లేకుండా అక్కడికి చేరుకుని మృతుడి కులం ఏమిటో ఆరా తీయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని ధ్వజ మెత్తారు. శవాల మీద రాజకీయాలు చేస్తూ లబ్ధి పొందడమే వారి నైజమని మండిపడ్డారు. "రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ క్షేత్రస్థాయి వాస్తవాలను, పచ్చి నిజాలను మాట్లాడు తుంటే వైసీపీ నేతలు ఎందుకు అంతగా భుజాలు తడుము కుంటున్నారో ప్రజలందరికీ స్పష్టంగా అర్థమవుతోంది." అంటూ తోట లక్ష్మీనారాయణ, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి తెలిపారు. ప్రజలను మభ్య పెట్టేలా వైసీపీ నడిపే కుల రాజకీయాలను ఆంధ్రప్రదేశ్ ఓటర్లు ఇకపై ఎంతమాత్రం నమ్మే పరిస్థితి లేదని తోట లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. గత ఐదేళ్ల నాటి చీకటి పాలనను చూసి విసిగిపోయిన ప్రజలు ఎన్నికల్లో వారికి సరైన బుద్ధి చెప్పా రన్నారు. విభజన రాజకీయాలకు




కాలం చెల్లిందని, ప్రస్తుతం అధి కారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కేవలం రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే పరమావధిగా దూసుకుపోతోందని ఆయన స్పష్టం చేశారు.

# చిరు వ్యాపారులకు రోటరీ క్లబ్ చేయూత

- రూ.90 వేల విలువైన 6 తోపుడు బండ్ల పంపిణీ

బాపట్ల : జూన్ 23 (ప్రజా వీక్షణం)

పండ్లు,కూరగాయలు,టిఫిన్లు విక్రయిస్తూ జీవనం సాగించే చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు జీవనాధారమని రోటరీ క్లబ్ అఫ్ బాపట్ల అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు







పేర్కొన్నారు.పట్టణంలోని విజయలక్ష్మిపురం రోటరీ కళ్యాణ మండపం వద్ద మంగళవారం రూ.90 వేల విలువైన రోటరీ చేయూత చక్రాలు ద్వారా 6 తోపుడు బండ్లను రోటరీ క్లబ్ అఫ్ లేక్ డిస్టిక్ మొయినాబాద్,రోటరీ క్లబ్ అఫ్ జూబ్లీహిల్స్,రోటరీ క్లబ్ అఫ్ పండరిపురం,మంగత్రం జ్యూవెలర్స్,కె.ఉపేంద్ర గుప్తా,ఎం.సుధీర్ కుమార్,కొల్లా శ్రీనివాసరావు,వేజెండ్ల శ్రీనివాసరావు ఆర్థిక సౌజన్యంతో అర్హులైన నిరుపేద వ్యాపారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వేజెండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ.....ఇప్పటి వరకు లబ్ధిదారులు అద్దె బండ్లతో వ్యాపారం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు.రోటరీ క్లబ్ అందజేసిన తోపుడు బండ్ల వల్ల వారికి నెలకు సుమారు రూ.3 వేల వరకు ఆదా అవుతుందని,ఏడాదికి దాదాపు రూ.36 వేల మేర అదనపు ఆదాయం సమకూరుతుందని వివరించారు.ఈ పొదుపు కుటుంబ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు.లబ్ధిదారులు ఈ బండ్లను సద్వినియోగం చేసుకోవాలని,వాటిని అమ్మడం లేదా కొనుగోలు చేయడం వంటి చర్యలకు పాల్పడరాదని సూచించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు రోటరీ క్లబ్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అఫ్ బాపట్ల కార్యదర్శి కొత్త ఆంజనేయ వరప్రసాద్,సర్వీస్ ప్రాజెక్టు డైరెక్టర్ జిట్టా శ్రీనివాసరావు,సభ్యులు ఈ.హరిబాబు,కోళ్లపూడి ఉపేంద్ర గుప్తా,కొల్లా శ్రీనివాసరావు,షేక్.మస్తాన్ వలి ( ఖాసీం ),జేవి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

GENERAL NEWS
ప్రజావీక్షణం
దినపత్రిక
24 బుధవారం, జూన్ 2026
4
www.prajaveekshanam.in

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ 'కొవ్వాసు జగదీశ్వరి' దంపతులు

- రాష్ట్ర అభివృద్ధి, ప్రజా క్షేమం కోసమే ప్రత్యేక పూజలు
- వేద పండితుల ఆశీర్వాదం, తీర్థప్రసాదాల స్వీకరణ

**పోలవరం, జూన్ 23 (ప్రజా వీక్షణం):**

కలియుగ ప్రత్యక్ష దైవం, తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి, బి. విజయ్ నాయక్ దంపతులు అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం ఆలయానికి చేరుకున్న వీరికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారి సన్నిధిలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం కొవ్వాసు జగదీశ్వరి దంపతులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, దేశప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని తాము స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కుటుంబ సౌఖ్యం, సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ పర్యటన సాగిందని పేర్కొన్నారు. దర్శనం ముగించుకుని బయటకు వచ్చిన దంపతులకు రంగనాయకుల మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ పవిత్ర 'వేదాశీర్వచనం' అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను వారికి బహూకరించారు. తిరుమల కొండపై ఆధ్యాత్మిక వాతావరణంలో సాగిన ఈ పర్యటన తమకు ఎంతో మానసిక ప్రశాంతతను ఇచ్చిందని, శ్రీవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు జగదీశ్వరి-విజయ్ నాయక్ దంపతులు వెల్లడించారు.



# విద్యుత్ బస్సులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించవద్దు

- బాపట్లలో ఆర్టీసీ కార్మిక సంఘాల డిమాండ్

**బాపట్ల : జూన్ 23 (ప్రజా వీక్షణం)**

ఆర్టీసీ విద్యుత్ బస్సులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించవద్దని,ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలని బాపట్లలో ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.మంగళవారం బాపట్ల పట్టణంలో కొత్త బస్టాండ్ లో ఆర్టీసీ ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జిలతో విధులకు హాజరై కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఆర్టీసీ విద్యుత్ బస్సుల ప్రైవేటీకరణ వల్ల ఉద్యోగ భద్రతకు ముప్పు ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఆర్టీసీ ఆస్తులు,సేవలు ప్రజా రంగంలోనే ఉండాలని నినాదాలు చేశారు.కార్మికుల హక్కులను కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ - బస్సుల నిర్వహణపై ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీలో 10 వేల ఖాళీలు భర్తీ చేయాలని,11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని,పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.




# పేదల సొంతింటి కల సాకారం దిశగా అడుగులు!

- హనుమంతుపాలెంలో టిడ్కో గృహాల పునర్నిర్మాణ పనులకు శ్రీకారం
- కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో నాణ్యమైన ఇళ్లు అందిస్తాం: ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**నందిగామ, జూన్ 23 (ప్రజావీక్షణం):లి**

సామాన్యుడి సొంతింటి కలను సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణ పరిధిలోని హనుమంతుపాలెం గ్రామంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరిన టిడ్కో ఇళ్లకు పునర్జీవం పోసేందుకు ముహూర్తం ఖరారైంది. ఇక్కడ నిర్మించనున్న జి ప్లస్ త్రీ టిడ్కో గృహాల పునర్నిర్మాణ పనులు, అంతర్గత రహదారులు, మరియు వివిధ మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మంగళవారం ఘనంగా శంకుస్థాపన చేశారు. కూటమి నేతలు, టిడ్కో అధికారులు, ప్రముఖ నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టి' ప్రతినిధులు, మరియు మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆమె సాంప్రదాయబద్ధంగా కొబ్బరికాయ కొట్టి ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, గత వైకాపా ప్రభుత్వ కక్షపూరిత నిర్ణయాలు, బాధ్యతారాహిత్యం వల్లే పేదల ఇళ్లు పాడుబడ్డాయని మండిపడ్డారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు సైతం కార్పొరేట్ స్థాయి నివాస సౌకర్యాలు పొందాలనే ఉన్నత ఆశయంతో గతంలో టిడ్కో గృహాల నిర్మాణాన్ని చేపట్టడం జరిగింది. కానీ, గత ప్రభుత్వం రాజకీయ కారణాలతో ఈ ప్రాజెక్టును పక్కన పెట్టేయడం వల్ల వేలాది పేద కుటుంబాలు ఇళ్లకు దూరమై తీవ్ర ఇబ్బందులు పడ్డాయి అని తంగిరాల సౌమ్య తెలిపారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కేవలం ఇళ్ల పునర్నిర్మాణమే కాకుండా, లబ్ధిదారుల కాలనీల్లో కార్పొరేట్ స్థాయి మౌలిక వసతులను కల్పించబోతున్నట్లు ఆమె ప్రకటించారు. నాణ్యమైన రహదారులు:లిలి కాలనీల లోపల అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం అలాగే ప్రతి ఇంటికీ నిరంతర తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం పనులను వేగంగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను త్వరలోనే హ్యాండోవర్ చేస్తామని హామీ ఇచ్చారు ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి సురక్షితమైన, సౌకర్యవంతమైన గృహాన్ని అందించడం ప్రభుత్వ బాధ్యత అని, ఈ దిశగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిడ్కో ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులు, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# తిరుమలలో ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఘన సన్మానం

- మర్యాదపూర్వకంగా కలిసిన శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి, విజయ్ నాయక్ దంపతులు
- గిరిజన సంక్షేమ అంశాలపై చర్చ

**పోలవరం, జూన్ 23 (ప్రజా వీక్షణం):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బుజ్జి రెడ్డిని తిరుమలలో ఏపీ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి, బి. విజయ్ నాయక్ దంపతులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు వారు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు.ఈ భేటీలో భాగంగా రాష్ట్రంలోని పలు సామాజిక, గిరిజన సంక్షేమ అంశాలపై వారు స్నేహపూర్వకంగా చర్చించారు. గిరిజనుల అభ్యున్నతి, హక్కుల రక్షణ కోసం ఎస్టీ కమిషన్ చేపడుతున్న పలు కార్యక్రమాలను, అందిస్తున్న సేవలను జగదీశ్వరి దంపతులు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. కమిషన్ చైర్మన్‌గా బుజ్జి రెడ్డి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ వారు శుభాకాంక్షలు తెలియజేశారు.ఎంతో ఆత్మీయ వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమం పట్ల పలువురు గిరిజన సంఘాల నాయకులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.



# లంకపాకల ఆశ్రమ పాఠశాలను 10వ తరగతి వరకు కొనసాగించాలి పిడిఎస్ యు డిమాండ్

- అధికారుల హామీతో తాత్కాలికంగా ముగిసిన ధర్నా..
- శాశ్వత జీవో రాకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరిక

**బుట్టాయిగూడెం, జూన్ 23:లి(ప్రజా వీక్షణం)**

లంకపాకల గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను 3వ తరగతి నుండి 7వ తరగతి వరకు తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ గత వారం రోజులుగా విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు చేపట్టిన ధర్నా మంగళవారం ఉద్రిక్తంగా మారింది. పాఠశాలకు తాళాలు వేసి గ్రామస్తులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శించారు. ఈ ధర్నాకు ప్రగతిశీల విద్యార్థి సంఘం పూర్తి మద్దతు ప్రకటించింది. ధర్నా ఉధృతం కావడంతో ఐటీడీఏ విద్యా శాఖ అధికారులు మంగళవారం లంకపాకల పాఠశాలకు చేరుకున్నారు. డివైఈవో కే. ప్రసన్నకుమార్, ఏఎంఓ కొవ్వాసు సిరమయ్య, సీఎంఓ సున్నం శ్రీనివాస్, జీసీడీఓ రాజేశ్వరి, ఏటీ డబ్ల్యూఓ జనార్ధన్ తదితర అధికారులు గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులతో చర్చలు జరిపారు. ఈ విద్యాసంవత్సరం పాఠశాలలో ఎలాంటి మార్పులు ఉండవని, 10వ తరగతి వరకు యధాతథంగా కొనసాగిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. పాఠశాలను హైస్కూల్‌గానే శాశ్వతంగా కొనసాగించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఉత్తర్వులు (ఆర్డర్స్) రావాల్సి ఉందని వారు వివరించారు.అయితే అధికారుల మాటలపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తొలుత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు తాత్కాలిక హామీలు వద్దని, శాశ్వత జీవో (ఆర్డర్) తెచ్చిన తర్వాతే పాఠశాల తాళాలు తీస్తామని పట్టుబట్టారు. ఈ క్రమంలో అధికారులు బలవంతంగా పాఠశాల తాళాలు తీసి ఓపెన్ చేయడంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత నెలకొంది.
పాఠశాలను పాత పద్ధతిలోనే 10వ తరగతి వరకు కొనసాగించాలన్నది గిరిజనుల బలమైన డిమాండ్. విద్యార్థుల చదువు నష్టపోకూడదనే ఉద్దేశంతో, ఈ విద్యాసంవత్సరానికి క్లాసులు నిర్వహించడానికి గ్రామస్తులు అంగీకరించారు. కానీ, ఈ ఏడాది లోపు ప్రభుత్వం నుండి శాశ్వత ఉత్తర్వులు తీసుకురాకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం అని కాకి నాని, పిడి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు తెలియజేసారు.ఈ నిరసన కార్యక్రమంలో అఖిలభారత ఆదివాసి వేదిక, ఏఐటీఎఫ్ జాతీయ కన్వీనర్ ఎస్. రామ్మోహన్, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కారం రాఘవ, మాజీ సర్పంచ్ కారం లక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ చింతల కృష్ణ, పీవైఎల్ నాయకులు నడిపి రాజు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే. నాని, బి. వినోద్, మాజీ సర్పంచ్ పట్ల చిన్నన్న మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




# బ్రహ్మోస్ స్థలాన్ని పరిశీలించిన ఆర్టీవో

**దేవరకద్ర జూన్ 23 ప్రజా విక్షణం**

దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చౌదర్పల్లి గ్రామ శివారులో బ్రహ్మోస్ క్షిపణి నిర్మాణ కోసం మంగళవారం ఆర్డిఓ నవీన్ తహసిల్దార్ మహ్మద్ హర్షద్, స్థలాన్ని పరిశీలించారు. ఈ పనులకు సంబంధించి జిల్లా అధికారులకు నివేదికలు పంపడం జరుగుతుందని వారు తెలిపారు. వారి వెంట ఆ రైలు, ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# దేవరకద్ర నియోజకవర్గం అభివృద్ధిపై చర్యలు తీసుకోండి. మంత్రిని కోరిన ఎమ్మెల్యే..

**దేవరకద్ర జూన్ 23 ప్రజా విక్షణం**





దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో పలు అభివృద్ధి అంశాలపై తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ సినీ ఆటో గ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంగళవారం స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నియోజక వర్గం సంబంధించి పలు అభివృద్ధిపై మంత్రితో చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం అన్ని విధాలా కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

GENERAL NEWS

24 బుధవారం, జూన్ 2026

5

www.prajaveekshanam.in

## పూడిక తీతకు బావిలో దిగి ఇద్దరు కూలీలు మృత్యువాత...

**పోలవరం జూన్ 22 (ప్రజా వీక్షణం )**

పూడిక తీత పని కోసం బావిలో దిగి ఇద్దరు కూలీలు మృత్యువాత పడిన సంఘటన ఏలూరు జిల్లా పోలవరం మండలం పోలవరం పంచాయతీ నూతనగూడెం గ్రామంలో సోమవారం ఉదయం జరిగింది. పోలవరం ఎస్ఐ పి అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం నూతనగూడెం గ్రామానికి చెందిన బండి మునీశ్వరరావు అనే వ్యక్తి ఇంటి ఆవరణలో ఉన్న బావిలో పూడికతీత తీయడానికి నూతనగూడెం గ్రామానికి చెందిన బండి వీర వెంకట్రావు (56) అలియాస్ అబ్బులు, బీసీ కాలనీకి చెందిన కదల చిట్టబ్బాయ్ రెడ్డి(35) అనే కూలీలు పనికి వచ్చారు. ముందుగా చిట్టబ్బాయ్ నడుముకి తాడు కట్టుకుని బావిలో దిగాడు 45 అడుగుల లోతున ఆక్సిజన్ అందకపోవడంతో కేకలు వేయడంతో వీర వెంకట్రావు అదే తాడుపట్టుకుని బావిలో దిగి అపస్మారక స్థితిలోకి చేరుకున్న చిట్టబ్బాల్ని తాడుకి కట్టి పైకి తీసుకొస్తున్న క్రమంలో తాడు తెగి ఇద్దరూ బావిలోకి పడిపోయారు. కంగారుపడకండి అని చెప్పిన ఇద్దరు సమాధానం ఇవ్వకపోవడంతో లైట్లు వేసి బావిలో చూడగా ఇద్దరూ అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. అక్కడే ఉన్న బండి శ్రీను కుటుంబం స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కొవ్వూరు ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చి వారి సహకారంతో మృతదేహాలను బయటకు తీసారు. బావిలో ఆక్సిజన్ అందకపోవడంతో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. చిట్టబ్బాయ్ రెడ్డి భార్య ముత్యాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





## జనసేన ఎమ్మెల్యేలు సంస్కారం మరిచి నోటికొచ్చినట్టు మాట్లాడటం సిగ్గుచేటు

### - మీడియాను దూషించిన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే వెంటనే వారికి క్షమాపణ చెప్పాలి

**తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 23 (ప్రజా వీక్షణం)**



జనసేన ఎమ్మెల్యేలు సంస్కారం మరిచి నోటికొచ్చినట్టు మాట్లాడటం సిగ్గుచేటని, మీడియాను దూషించిన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే వెంటనే వారికి క్షమాపణ చెప్పాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త,అప్పాడ మాజీ వైస్ చైర్మన్ వడ్డీ రఘురాం నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక సవిత్రు పేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పరిపాలన చూసిన తర్వాత జగన్మోహన్ రెడ్డికి ప్రజల్లో మరింత ఆదరణ పెరుగుతుందని తెలిపారు. ఇటీవల కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై నిర్వహించిన వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని, ఇది చూసి కూటమి ప్రభుత్వ నాయకులు ఓర్వలేకపోతున్నారని ఎద్దేవాచేశారు. ఏలూరు పార్లమెంట్ వైసీపీ ఇన్చార్జి కారుమూరి సునీల్ ను అన్యాయంగా అరెస్టు చేయడాన్ని తీవ్ర స్థాయిలో ఖండిస్తున్నామని తెలిపారు. సునీల్ ఎంతో మృదుస్వభావని, ఎవరికి హానీ చేయని వ్యక్తి అని, నిరంతరం ప్రజలకోసం తాపత్రయపడే యువనేత అని ప్రశంసించారు. కాపు నాయకుడు తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో ద్రాక్షారామం వద్ద కాపు నేతలు ఆత్మీయ సమావేశం నిర్వహించుకుంటే కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ నోటికొచ్చినట్లుగా వాగటం దారుణమన్నారు. మాజీ ముఖ్యమంత్రి అని కూడా లేకుండా జగన్ మోహన్ రెడ్డిని దారుణమైన పదజాలంతో దూషించతం హేయమైన చర్య అని, అదే మేము మీ నాయకుడిని అంటే ఏం చేస్తావని ప్రశ్నించారు. ఇటువంటి మాటలు మాట్లాడడానికి మా సంస్కారం అడ్డు వస్తుందని తెలిపారు. జనసేన ఎమ్మెల్యేలు అందరూ ఇలాగే ఉన్నారని ఆరోపించారు. తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే వార్తలు రాసిన విలేకరులను అమ్మకి అబ్బకి పుట్టారా అంటూ మాట్లాడటం గా అత్యంత హేయమని, మనం ఎవరికి పుట్టామని ఎద్దేవాచేశారు. ఈ పదవులు మీకు శాశ్వతమా. వంశపారంపర్యంగా మీ పదవుల్లో మీరే ఉంటారని అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. రోజులు ఎప్పుడు ఒకేలా ఉండవని ప్రభుత్వాలు మారుతాయని, నాయకులు మారుతారనే విషయాన్ని గుర్తుపెట్టుకోవలన్నారు. మనం నిజాయితీపరులమా కాదా అవునా అనేది మనం చెప్పుకోకూడదని, ప్రజలు చెప్పుకోవాలన్నారు. మీడియాను అవమానించేలా మాట్లాడడం చాలా తప్పని, వెంటనే మీడియాకు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పాలని, వారిని అన్న మాటలు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాపు నాయకులను కుక్కలంటూ హేళన చేసిన పంతం నానాజీదీ కూడా అదే కులమని, వారి నాయకుడది అదే కులమని, మరి వీరేం అవుతారో చెప్పాలని మండిపడ్డారు. జనసేనకు ఓటు వేసిన వాళ్ళు కులాన్ని చూసి కాదా వేసింది అని ప్రశ్నించారు. పదవిలోకొచ్చాక నోటికి వచ్చినట్లు మాట్లాడడం సరికాదని, పనికిమాలిన మాటలు మాట్లాడటం మానేసి అందరిని గౌరవించడం నేర్చుకోవాలని హితబోధ చేశారు.

## ద్వారక తిరుమల అభివృద్ధికి గడ్డమణుగు రవి ప్రణాళికలు

### - ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రశంసలు!





**ద్వారకాతిరుమల:జూన్ 23(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన ద్వారక తిరుమల శ్రీ చిన్న వెంకన్న దేవస్థానాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు జనసేన జిల్లా కార్యదర్శి, మాజీ జెడ్పిటిసి, ఆలయ ధర్మకర్త మండలి స్పెషల్ ఇన్వైటీ గడ్డమణుగు రవి కుమార్ పలు అద్భుతమైన ప్రతిపాదనలు చేశారు. మంగళవారం ఆలయ చైర్మన్ రాజా సూరానేని వెంకట సుధాకర్ రావు అధ్యక్షతన ద్వారకాతిరుమలలో కీలక ధర్మకర్త మండలి సమావేశం జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి సారిగా జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాజమండ్రి పార్లమెంటు సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి, గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా గడ్డమణుగు రవి కుమార్ ఆలయ అభివృద్ధితో పాటు, చుట్టుపక్కల ప్రాంతాలను కలుపుతూ 'టెంపుల్ ఎకో-టూరిజం' అభివృద్ధి చేయాలని కోరారు. రవికుమార్ సూచించిన ప్రతిపాదనలు, సలహాలపై ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే వెంకట రాజు, చైర్మన్ సుధాకర్ రావు ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. అలాగే సమావేశంలో గడ్డమణుగు రవికుమార్ చేసిన ముఖ్య సూచనలు...ద్వారక తిరుమల, ఐ.ఎస్. జగన్నాధపురం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, శ్రీ మద్ది ఆంజనేయ స్వామి ఆలయం, మరియు జంగారెడ్డి గూడెం పారిజాత గిరి పుణ్యక్షేత్రాలను అనుసంధానిస్తూ భక్తుల సౌకర్యార్థం ఎకో-టూరిజం సర్క్యూట్ అభివృద్ధి చేయాలని అన్నారు. అంతేకాకుండా ద్వారక తిరుమల నుండి ఐ.ఎస్. జగన్నాధపురం వరకు ఉన్న 22 కిలోమీటర్ల రహదారిని ఫోర్ లేన్‌గా విస్తరించాలి. భక్తుల బస కోసం జగన్నాధపురంలో ప్రత్యేక కాటేజీలు నిర్మించాలని, ఈ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి ఈ అంశాలను తీసుకువెళ్లాలి అంటూ ప్రతి శనివారం ఇద్దరు ట్రస్ట్ సభ్యుల చొప్పున సాధారణ భక్తులతో క్యూలైన్లలో మమేకమై, వారి ఇబ్బందులు మరియు సూచనలను ప్రత్యక్షంగా తెలుసుకుని సేవలందించాలని,భక్తులు ఎంతో ఇష్టపడే స్వామివారి పులిహోర ప్రసాద పంపిణీని సాయంత్రం 3:00 గంటల వరకు, అలాగే నిత్య అన్నసమారాధనను పగటిపూటతో పాటు రాత్రి 10:00 గంటల వరకు అందుబాటులో ఉంచాలని తెలుపుతూ కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత జరిగిన ఈ తొలి సమావేశం అత్యంత ఆహ్లాదకర వాతావరణంలో జరిగిందని రవికుమార్ తెలిపారు. సమావేశంలో చర్చించిన అన్ని కీలక సూచనలు, సలహాలను తీర్మానించి, తగిన ప్రణాళికలు రూపొందించాలని బోర్డు నిర్ణయించింది.కార్యక్రమం ముగింపులో తనకు మద్దతుగా నిలిచిన ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే వెంకటరాజు, చైర్మన్ సుధాకర్ రావు, ఈవో త్రినాధరావు, మరియు ఆలయ ప్రధాన అర్చకులు రాంబాబులకు గడ్డమణుగు రవికుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## దేశ ఆర్థిక వృద్ధిలో మత్స్యరంగం ఎంతో కీలక పాత్ర పోషిస్తుంది

### - డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విద్యాలయం ఉప కులపతి, డాక్టర్ ధనంజయరావు





**తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 23 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చేపలు, రొయ్యల్లో వ్యాధుల నిర్ధారణ, నివారణ పద్ధతులు అనే అంశంపై ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం మంగళవారం ముగిసింది. నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం ఉప కులపతి, డాక్టర్ కె. దనుంజయరావు మాట్లాడుతూ దేశ ఆహార భద్రత, ఆర్థిక సమృద్ధిలో మత్స్య రంగం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. మత్స్య రంగంలో పెరుగుతున్న వ్యాధుల ముప్పును ఎదుర్కోవడానికి మత్స్య నిపుణులు, రైతులు, విస్తరణ అధికారులకు శాస్త్రీయ జ్ఞానం, ఆచరణాత్మక సాధనాలను అందించడానికి ఈ శిక్షణా కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. సమాజంలో స్థిరమైన మత్స్య పద్ధతులకు శిక్షకులు రాయబారులుగా మారాలని, సురక్షితమైన, మత్స్య సంపదకు కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణకు ఆర్థిక సహకారం నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. విస్తరణ సంచాలకురాలు డాక్టర్ సిహెచ్ రూత్ మాట్లాడుతూ ఆక్వా రైతుల ఉన్నతికి దోహదపడే ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను భవిష్యత్తులోను నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే కోర్స్ డైరెక్టర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సి.హెచ్. కిరణ్ కుమార్. కోర్స్ కో-డైరెక్టర్ డాక్టర్ ఎ.దేవివరప్రసాద్ రెడ్డి, కో ఆర్డినేటర్లు డాక్టర్ ఇ.రేఖ, డాక్టర్ కె.అర్చన ఈ కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు.

## క్రీడాకారుల ప్రోత్సాహానికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయం: ఎమ్మెల్యే బడేటి చంటి

### - ఏలూరులో ఘనంగా అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం

### - ఒలింపిక్ రన్‌ను ప్రారంభించి, ఒలింపిక్ జ్యోతితో కదిలిన ఎమ్మెల్యే







**ఏలూరు, జూన్ 23 (ప్రజా వీక్షణం):లి**

క్రీడాకారులను అన్నివిధాలా ప్రోత్సహించేందుకు మరియు క్రీడా ప్రమాణాల మెరుగుదలకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి వెల్లడించారు. మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహకులు, క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఇండోర్ స్టేడియం నుండి ప్రారంభమైన 'ఒలింపిక్ రన్'ను ఎమ్మెల్యే జెండాఊపి ప్రారంభించారు. ఈ రన్‌లో ఆయనే స్వయంగా ఒలింపిక్ జ్యోతిని పట్టుకుని ముందుకు కదలడంతో క్రీడాకారుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా పలువురు ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎమ్మెల్యే బడేటి చంటి ఘనంగా సన్మానించి, అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా క్రీడలు, ఆరోగ్యం, ఐక్యతను ప్రతిబింబించేలా ప్రతి ఏటా ఈ ఒలింపిక్ దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. రాబోయే రోజుల్లో క్రీడలకు పూర్వవైభవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే 420 మంది క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాగే, 2036లో భారతదేశం వేదికగా ఒలింపిక్ క్రీడలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బడేటి వెంకటరామయ్య, ఏపీ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ దిన్నా బాబు, ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాసరావు, ఆర్.ఎన్.ఆర్. నాగేశ్వరరావు, రామారావు మరియు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# దేశ సమైక్యత కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ

తాడేపల్లిగూడెం, జూన్ 23

దేశ సమైక్యత, సమగ్రతల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని పలువురు బిజెపి నేతలు కొని యాడారు. భారతీయ జనసంఘ్ అగ్రనేత డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని స్థానిక భాజపా కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను ఆధ్వర్యం వహించారు. రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి మాట్లా డుతూ నాడు ప్రధాని జవహర్లాల్ నెహ్రూ పాకిస్తాన్ లియాఖత్ ఒప్పశీదం పేరిట హిందువులకు వ్యతిరేకంగా చేసుకున్న ఒప్పందానికి నిరసనగా కేంద్ర మంత్రిగా ఉన్న డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ తన పదవికి రాజీనామా చేసి దేశ సమైక్యత, సమగ్రతల కోసం ఉద్యమం చేపట్టారని తెలిపారు. భారతీయ జనసంఘ్ స్థాపనకు కృషిచేశారని, ప్రతి ఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభ్యున్నతికి పాటు పడాలని సూచించారు. భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షు రాలు పైడి కొండల సింధు మాట్లా డుతూ కాశ్మీర్ విషయంలో నెహ్రూ ప్రభుత్వం వైఖరిని తీవ్రంగా వ్యతిరే కిస్తూ దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జాతీయ జెండాలుండటాన్ని అంగీకరించబోమని శ్యామప్రసాద్ కాశ్మీర్ పర్యటన కు వెళ్లారన్నారు. నెహ్రూ ప్రభుత్వం ఆయన్ను అరెస్ట్ చేసిందని వివరించారు. భాజపా జిల్లా నాయకులు ఈతకోట తాతాజీ మాట్లా డుతూ దేశ సమైక్యత సమగ్రత కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు సాధనకు నరేంద్ర మోడీ ప్రభుత్వం విశేషంగా కృషి



చేస్తుందని ప్రశంసించారు. ముందుగా నాయకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులు అర్పించారు .ఈ కార్యక్రమంలో నాయకులు కోట రాంబాబు, దత్తు ప్రసాద్, పాటే నాగేశ్వరరావు, ముప్పిడి సురేష్ రెడ్డి, మారిశెట్టి నరసింహమూర్తి, చిట్యాల రాంబాబు, కావ్య లిఖిత, లచ్చిరెడ్డి సత్యనారాయణ, కసిరెడ్డి నాగ దుర్గ, ఎస్వి రంగారావు, యార్నాల సూర్య చంద్రరావు, నారాయణ, రామగాని సత్యనారాయణ, గోకా మహాలక్ష్మి, సన్నిధి లక్ష్మీ దుర్గ, చెరుకూరు గంగాధర ఇమ్మంది బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పద్మపురస్కారాల ప్రదానం

## పద్మభూషణ్ అందుకున్న నటుడు మమ్ముట్టి

## పద్మశ్రీలు అందుకున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్

## కార్యక్రమంలో ప్రధాని మోడీ తదితరుల హాజరు

న్యూఢిల్లీ,జూన్23 (ప్రజా వీక్షణం)

రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు ఈ గౌరవాలను అందుకున్నారు. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించింది. అలాగే ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేశారు. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌తో పాటు నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. క్రికెటర్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి అందజేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేందప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి మంగళవారం ప్రదానం చేశారు. దేశ అభివృద్ధికి, తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.



# తాటియాకులగూడెం సరిహద్దు వద్ద వినూత్న హెచ్చరిక

## - రోడ్డు ప్రమాదాల నివారణకు ధ్వంసమైన బైక్‌తో 'లైవ్' డెమో!

జీలుగుమిల్లి జూన్ 23(ప్రజా వీక్షణం)

రోడ్డు ప్రమాదాల నివారణకు అధి కారులు, స్థానికులు కలిసి చేపట్టిన ఒక వినూత్న ప్రయత్నం ఏలూరు జిల్లాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెం సమీపంలో ప్రధాన రహదారిపై ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ అంతరాష్ట్ర రహదారి ఇటీవల కాలంలో వరుస రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. మితిమీరిన వేగం, అజాగ్రత్తల కారణంగా ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో వాహనదారుల్లో అవగాహన కల్పించడం అధికారులకు సవాల్‌గా మారింది. సాధారణ సైన్ బోర్డులు, హెచ్చరిక పలకలు ఏర్పాటు చేసినప్పటికీ... వేగంగా వెళ్లే వాహనదారులు వాటిని పెద్దగా పట్టించుకోకపోవడంతో ఈ కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ప్రమాద తీవ్రత ఎంత ఘోరంగా ఉంటుందో కళ్లకు కట్టేలా చూపిస్తేనే వాహనదారుల్లో మార్పు వస్తుందని భావించిన స్థానికులు, అధికారులు రోడ్డు పక్కన ఒక వినూత్న ప్రదర్శనను ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ జరిగిన ఒక ఘోర ప్రమాదంలో పూర్తిగా ధ్వంసమైన మోటార్ సైకిల్‌ను సేకరించారు.రహదారి పక్కన రెండు ఖాళీ డ్రమ్ములను ఉంచి, వాటిపై ఈ ధ్వంసమైన బైక్‌ను అందరికీ కనిపించేలా ఎత్తుగా నిలబెట్టారు. దూరం నుంచి వచ్చే వాహనదారులకు ఈ ధ్వంసమైన బైక్ స్పష్టంగా కనిపిస్తుంది. 'మనం కూడా అజాగ్రత్తగా ఉంటే మన వాహనానికి, మన ప్రాణానికి కూడా ఇలాంటి గతే పడుతుంది అనే పచ్చి నిజాన్ని ఇది కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ఇది చూసైనా వేగం



తగ్గించి, జాగ్రత్తగా ప్రయాణిస్తారని ఆశిస్తున్నాం అని తెలిపారు.ఈ వినూత్న హెచ్చరికను చూసిన పలు వురు వాహనదారులు సానుకూలంగా స్పందిస్తూ, వేగాన్ని నియంత్రించుకుంటూ వెళ్తున్నారు. ప్రమాదాల నివారణకు అధికారులు, స్థానికులు తీసుకున్న ఈ వినూత్న చొరవపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# బాసర సరస్వతీ ఆలయంలో చోరీ

## కాళీమాత ఆలయంలో వెండి కిరీటం చోరీ

## సిసి కెమెరాలపై బట్టలు కప్పి చీరికి పాల్పడ్డట్లు గుర్తింపు

## సమాచారం అందుకుని పరిశీలించిన ఎస్పీ

నిర్మల్,జూన్23 (ప్రజా వీక్షణం)

బాసరలో కొలువుదీరిన జ్ఞాన సరస్వతి దేవి ఆలయంలో భారీ చోరీ జరిగింది. మొదటి అంతస్తులోని మహంకాళి అమ్మవారి ఆలయంలో తలుపు తాళాలు దొంగలు పగలకొట్టి అమ్మవారి వెండి కిరీటంతోపాటు హుండీని దొంగిలించారు. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం చేసేందుకు దేవాలయంలోకి పురోహితులు వెళ్లారు. అమ్మవారి ఆలయంలో చోరీ జరిగిన విషయాన్ని వారు గుర్తించారు అనంతరం దేవస్థానం అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సరస్వతి అమ్మవారి ఆలయంలోని పై అంతస్తులో ఉన్న మహంకాళి అమ్మవారి వెండి కిరీటంతో పాటు హుండీని దుండగులు ఎత్తుకెళ్లారు. గర్భగుడి తాళాలు పగులగొట్టి మరీ ఈ దోపిడీకి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సేవ, పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ గుడికి వచ్చిన సందర్భంగా తాళాలు పగులగొట్టి ఉండటం గుర్తించాడు. వెంటనే ఈ విషయాన్ని ఆలయ భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. ఆలయ భద్రతా సిబ్బంది ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆలయ పూజారి చేత తలుపులు తెరిపించారు. ఆ సమయంలో అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటంతో పాటు హుండీని అపహరించినట్లు పోలీసులు గుర్తించారు.కాగా, సీసీ కెమెరాలపై వస్త్రాలు కప్పి దొంగలు ఆలయంలోకి ప్రవేశించినట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. చోరీకి పాల్పడిన హుండీలో నుంచి డబ్బులు తీసుకుని, తర్వాత హుండీని వ్యాసగుడి సమీపంలో పడేసినట్లుగా పోలీసులు గుర్తించారు. బాసర ఆలయంలో చోరీ గురించి సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఘటనాస్థలిని పరిశీలించారు. చోరీ జరిగిన తీరు, సేకరించిన ప్రాథమిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీల పరిశీలన తదితర అంశాలపై అధికారులతో సమావేశమయ్యారు. కేసును అన్ని కోణాల్లో విచారించి నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



# పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం

## దక్షిణ్ ఎనర్జీ' పరిశ్రమ అగ్నిప్రమాదంలో ఇద్దరు మృతి

## ఘటనపై ఆరా తీసిన సిఎం చంద్రబాబు

## తక్షణ సహాయ చర్యలకు ఆదేశం

## డిప్యూటి సిఎం పవన్, మంత్రి లోకేశ్ తదితరుల దిగ్భ్రాంతి

అనకాపల్లి,జూన్23 (ప్రజా వీక్షణం)



పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం సంభవించింది. మంగళవారం తెల్లవారుజామున ప్లాస్టిక్ పైరోలిసిస్ ఆయిల్ తయారీ కంపెనీ దక్షిణ్ ఎనర్జీలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో పలువురు కార్మికులు ఫ్యాక్టరీలోనే చిక్కుకుపోయారు.ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా.. పలువురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఘటన గురించి తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుంది. మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మరోవైపు పోలీసులూ రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు.అనకాపల్లి జిల్లా పరవాడలోని ఫార్మా సిటీలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మా సిటీలోని 'దక్షిణ్ ఎనర్జీ' పరిశ్రమలో జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోవడంపై సంతాపం వ్యక్తం చేశారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే, ఈ ప్రమాదంలో గాయపడిన బాధితులను తక్షణమే ఆదుకోవాలని, అత్యంత మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలని వేగవంతం చేశామని అధికారులు తెలిపారు. ప్రమాద తీవ్రతను గమనించి ఫార్మా సిటీ అగ్నిమాపక కేంద్రం నుంచి రెండు, పరవాడ కేంద్రం నుంచి మరొక ఫైర్ ఇంజన్‌ను తక్షణమే ఘటనా స్థలానికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరపాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు. ఇకపోతే అగ్నిప్రమాదంపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మరోవైపు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.'దక్షిణ ఎనర్జీ కెమికల్ ఫ్యాక్టరీ'లో జరిగిన అగ్ని ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ప్రమాదంపై ఆరా తీసిన ఉపముఖ్యమంత్రి... ఇద్దరు కార్మికులు మరణించడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని పవన్‌కు అధికారులు తెలియజేశారు. పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించడానికి తీసుకుంటున్న చర్యలను సమీక్షించాలని డిప్యూటీ సీఎం సూచించారు. విశాఖపట్నం పరిసర పారిశ్రామిక ప్రాంతాల్లోని అన్ని సంస్థల్లో తక్షణమే భద్రతా తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అగ్నిప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పవన్ కల్యాణ్ ప్రకటించారు.ఫార్మాసిటీ ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కూడా స్పందించారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందడం విషాదకరమని పేర్కొన్నారు. గాయపడిన కార్మికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాల అమలు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని తేల్చి చెప్పారు. ప్రమాదంపై పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు కూడా విచారం వ్యక్తం చేశారు. ఈ అగ్నిప్రమాదం దురదృష్టకరమని, క్షతగాత్రులకు అధికార యంత్రాంగం మెరుగైన వైద్యం అందిస్తోందని పేర్కొన్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందని.. పూర్తి వివరాలు త్వరలోనే తెలుస్తాయని అన్నారు.



# మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్టు

## రైతు ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

## యూరియా యాప్‌ను ఎత్తేయాలన్న వేముల

## సకాలంలో యూరియా సరఫరా చేయాలని డిమాండ్

హైదరాబాద్,జూన్23 (ప్రజా వీక్షణం)

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు నిర్బంధించారు. యూరియా యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా తాడ్వాయి మండలంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి జాజాల సురేందర్ ఆధ్వర్యంలో వేలాది మంది రైతులు ధర్నా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ధర్నాలో పాల్గొనేందుకు వేముల ప్రశాంత్ రెడ్డి బయల్దేరగా.. ముందస్తు చర్యల్లో భాగంగా ఆయన్ను పోలీసులు ఇంటి వద్దే నిలువరించారు. రైతులు యూరియా యాప్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో యూరియా దొరకడం లేదనే బాధతో నిరసన కార్యక్రమం చేపట్టారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. రైతుల పిలుపు మేరకు, ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ సురేందర్ నాయకత్వంలో తామంతా అక్కడికి బయల్దేరాలని నిర్ణయించుకున్నామని, అయితే తనను హైదరాబాద్‌లోనే హౌస్ అరెస్ట్ చేయడం చాలా దుర్మార్గమని ఎమ్మెల్యే వేముల మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటువంటి నియంతృత్వ పాలనతో సాధించేదేమీ ఉండదని ఎమ్మెల్యే వేముల హితవు పలికారు. 'మమ్మల్ని అరెస్ట్ చేసి మా గొంతు నొక్కే బదులు, అక్కడ రైతులకు ఇబ్బందిగా మారిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అన్-సీజన్‌లోనే దేశంలో ఎక్కడ యూరియా దొరికినా కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వ ఉంచేవారు. రైతులు ఆటో వానికి పైసలు ఇచ్చి పంపిస్తే, నేరుగా పొలాల వద్దకే యూరియా సంచులు వచ్చే పరిస్థితి ఉండేదని , అందుకే రైతన్నలకు ఎలాంటి కొరత లేకుండా యూరియా దొరికిందని గుర్తుచేశారు. ఆ తెలివి ప్రస్తుత ముఖ్యమంత్రికి లేదన్నారు. రైతులకు సరిపడా యూరియాను విరివిగా అందుబాటులో ఉంచాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి అంతా హైదరాబాద్‌లో భూములు ఎక్కడున్నాయి. వాటిని ఏం చేయాలనే దానిపైనే ఉంది తప్ప, రైతుల బాధలపై లేదని ఎమ్మెల్యే వేముల విమర్శించారు. నిన్న మొన్నటి దాకా వడ్ల కొనుగోలు కోసం రైతులను ఏడు చెరువుల నీళ్లు తాగించారని, ఇప్పుడు యూరియా కోసం ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి నిరసన తెలుపుతామంటే, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 300 మంది బీఆర్ఎస్ పార్టీ



కార్యకర్తలను పొద్దున నుంచి అరెస్ట్ చేసి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇంచార్జ్ సురేందర్ , తాడ్వాయి మండల కేంద్రంలో డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్ రెడ్డిలను అరెస్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని, రోడ్ల మీదికి వస్తున్న రైతులను సైతం వదలకుండా అరెస్ట్ చేస్తున్నారని తెలిపారు. కామారెడ్డి పట్టణంలో బాన్సువాడలో కూడా బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారన్నారు. ప్రజా పాలన తెస్తామన్న రేవంత్ రెడ్డి ఇవాళ నియంతృత్వ పాలన సాగిస్తున్నారు. అరెస్టులతో మా గొంతు నొక్కే బదులు యూరియా యాప్ రద్దు చేసి సరిపడా యూరియా రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డిది ప్రజా పాలనా లేక నియంత పాలనా అనేది తెలంగాణ సమాజం, ప్రజా సంఘాలు ఆలోచించాలి. ఎక్కడో కామారెడ్డి జిల్లాలో నిరసన ఉంటే హైదరాబాద్‌లో మమ్మల్ని అరెస్ట్ చేయడం ఈ ప్రభుత్వం ఎంత నియంతృత్వంగా పనిచేస్తుందో చెప్తోంది. మమ్మల్ని అరెస్ట్ చేసినా రైతుల్లో వచ్చే తిరుగుబాటును మాత్రం ఆపలేరు. రైతులు తప్పకుండా బుద్ధి చెప్తారు'అని ఎమ్మెల్యే వేములహెచ్చరించారు. ఢిల్లీకి 72 సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెట్రో రైలు పైన సమావేశాలు పెట్టడానికి సమయం ఉంటుంది కానీ, కేంద్ర ప్రభుత్వాన్ని యూరియా గురించి అడిగే శ్రద్ధ లేదన్నారు. రేవంత్ రెడ్డికి రైతులంటే చాలా చులకన భావం ఉందని విమర్శించారు. అటు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా రాష్ట్రానికి రావాల్సిన యూరియాను ఒకేసారి ఇవ్వకుండా కోతలు విధిస్తోందని, ఇటు రేవంత్ రెడ్డికి కేంద్రం నుండి తెచ్చుకునే తెలివి లేదని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలుగా తాము రైతుల బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుంటే వినే ఓపిక లేకపోగా, రివర్స్‌లో అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. అటు నరేంద్ర మోదీ, ఇటు రేవంత్ రెడ్డి.. ఈ రెండు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా విషయంలో, వడ్ల కొనుగోలు విషయంలో తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నాయని ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి నివాసంలో ఏసీబీ సోదాలు

## తెల్వారు జాము నుంచే పలుచోట్ల ఏక కాలంలో తనిఖీలు

నిజామాబాద్,జూన్23 (ప్రజా వీక్షణం)

హైదరాబాద్ నగరంలో మరోసారి ఏసీబీ అధికారుల సోదాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి నివాసంలోనూ ఏసీబీ సోదాలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే సోదాలు కొనసాగాయి. ఆదాయానికి మించి అక్రమాస్తులు కలిగి ఉన్నారనే పక్కా సమాచారంతో మల్లారెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువులు, సన్నిహితుల నివాసాల్లోనూ దాడులు చేపట్టారు. హైదరాబాద్, నిజామాబాద్‌లో మొత్తం పదిచోట్ల ఏకకాలంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. మూడు సంవత్సరాల క్రితం ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా మల్లారెడ్డి విధుల్లో చేరారు. ఇటీవల ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు అయ్యింది. దీంతో తెల్లవారుజామునే ప్రత్యేక బృందాలు నిజామాబాద్ చేరుకుని.. అక్కడి ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. ఆఫీసులో విధుల్లో ఉన్న ఉద్యోగులు, సిబ్బందిని కూడా విచారించారు. ప్రగతినగర్‌లో మల్లారెడ్డి అద్దెకు ఉంటున్న ఇంట్లో సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన పత్రాలు లభించినట్లు సమాచారం.

# జంటహత్యల కేసులో విస్తుపోయే విషయాలు

## స్నేహితుల మధ్య ఇఎంఐ చిచ్చే కారణం

## శ్రీధర్‌ను దారుణంగా హత్య చేసిన ప్రభాకర్ తదితరులు

## ప్రభాకర్ తండ్రిని మట్టుబెట్టిన శ్రీధర్ బంధువులు

## సూరారం గ్రామంలో హత్యలపై పోలీసుల దర్యాప్తు

మెదక్,జూన్23 (ప్రజా వీక్షణం)

మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం సురారం గ్రామంలో తీవ్ర కలకలం రేపిన జంట హత్యల కేసులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో ప్రాణ స్నేహితులైన శ్రీధర్, ప్రభు (ప్రభాకర్) మధ్య ఉన్న చిన్నపాటి ఆర్థిక వివాదం, ఆపై కుటుంబ గొడవలే ఈ దారుణ హత్యలకు దారితీశాయి. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. శ్రీధర్, ప్రభు గతంలో అత్యంత సన్నిహితంగా ఉండేవారు. ప్రభు బంధువుల నుంచి శ్రీధర్ ఒక ఆటోను ఈఎంఐ పద్ధతిలో తీసుకున్నాడు. అయితే, రెండు నెలల ఈఎంఐ బకాయిల విషయంలో వీరిద్దరి మధ్య గొడవ మొదలైంది. ఈ క్రమంలోనే గతంలో ప్రభు.. శ్రీధర్‌పై హత్యాయత్నానికి కూడా పాల్పడగా, అప్పట్లో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ గొడవ ఇలా ఉండగానే, శ్రీధర్‌కు వరుసకు చెల్లెలు అయ్యే అమ్మాయిని ప్రభు రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ వివాహంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు, పగ మరింత తీవ్రరూపం దాల్చాయి. ఈ వివాదాలను పరిష్కరించుకోవడానికి ఇద్దరూ ఒకచోట కలుసుకుని మాట్లాడుకుందామని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఒకరికొకరు లొకేషన్లు షేర్ చేసుకున్నారు. ఈ క్రమంలో చేగుంట మండలం అనంతసాగర్ వద్దకు శ్రీధర్ బైక్‌పై రాగానే.. అప్పటికే పథకం ప్రకారం అక్కడ వేచి ఉన్న ప్రభు, అతని స్నేహితులు ఆటోతో శ్రీధర్ బైక్‌ను బలంగా ఢీకొట్టారు. అనంతరం శ్రీధర్‌ను దారుణంగా హతమార్చి అక్కడి నుంచి పరారయ్యారు. కన్నకొడుకు శ్రీధర్ హత్యకు గురయ్యాడనే విషయం తెలవడంతో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు ప్రతీకారంతో రగిలిపోయారు. ప్రభుపై కక్షతో అర్ధరాత్రి వేళ అతని తండ్రి యాదగిరిని టార్గెట్ చేసి దారుణంగా హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు యాదగిరి మృతదేహాన్ని మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామ శివారులోని హల్దీవాగులో పడేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# పాక్, ఖతార్‌లను నమ్మలేం

## ఉగ్రవాదానికి ఊతమిచ్చిన ఘనత వారిది

## బిన్‌లాడెన్‌ను దాచిపెట్టిన చరిత్ర పాక్‌ది

## జెడి వాన్స్ వ్యాఖ్యలపై ఇద్దరు సెనేటర్ల విమర్శలు

వాషింగ్టన్,జూన్23 (ప్రజా వీక్షణం)

పాకిస్థాన్‌పై ప్రేమను వ్యక్తం చేస్తూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై అమెరికాకు చెందిన ఇద్దరు సెనేటర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ దేశ ఉగ్రచరిత్ర గురించి ప్రస్తావిస్తూ, బిన్ లాడెన్‌ను దాచిన ఘనత పాక్‌దని అన్నారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, ఖతార్ దేశాలపై అమెరికాకు చెందిన ఇద్దరు రిపబ్లికన్ సెనేటర్లు రిక్ స్కాట్, టిమ్ షీహీ ఘాటుగా స్పందించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన చరిత్ర ఆ దేశాలకు ఉందంటూ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. కాగా, అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందానికి సంబంధించిన సాంకేతిక వివరాలపై స్విట్జర్లాండ్‌లో ఇటీవల చర్చలు జరిగాయి. ఈ సమావేశానికి పాకిస్థాన్, ఖతార్ నాయకులతో వాన్స్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'మేము పాకిస్తాన్‌ను ప్రేమిస్తున్నాం' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. అయితే, ఈ చర్చల్లో పాకిస్థాన్, ఖతార్‌లను నిష్పక్షపాత మధ్యవర్తులుగా చూడకూడదని సెనేటర్ రిక్ స్కాట్ తేల్చి చెప్పారు. మధ్యప్రాచ్యంలో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలే వాషింగ్టన్‌కు నిజమైన మిత్రదేశాలని పేర్కొన్నారు. ఆ దేశాలనూ అమెరికా చర్చల్లో చేర్చుకోవాలని స్కాట్ సూచించారు. 'మన నిజమైన స్నేహితులు ఎవరో ఇప్పటికే అందరికీ స్పష్టంగా తెలిసి ఉండాలి. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన సుదీర్ఘ చరిత్ర ఖతార్, పాకిస్థాన్‌లకు ఉంది. ప్రస్తుతం వారు అర్థవంతమైన శాంతిని సాధించడం కంటే ఇరాన్ దశాబ్దాల నాటి ఉగ్రవాద ప్రచారాన్ని ప్రోత్సహించడానికే మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. అందరికీ ప్రయోజనం చేకూర్చే ఆచరణీయమైన ఒప్పందానికి ఇంకా ఆస్కారం ఉంది' అని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా మోంటానా సెనేటర్ టిమ్ షీహీ కూడా పాకిస్థాన్‌ను విమర్శించారు. 'పాకిస్థాన్ ఒక దశాబ్దం పాటు బిన్ లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చిందనే విషయాన్ని మనం మరిచిపోకూడదు. పాకిస్థానీలు ఐఎస్ఐ ద్వారా మాపై పోరాడే వారికి నిధులు సమకూర్చారు. ముఖ్యంగా అయతుల్లాకు నిధులు అందించారు. ఖతార్ కూడా దశాబ్దాలుగా ఉగ్రవాద సంస్థలకు మనీలాండరింగ్ ద్వారా డబ్బును అందిస్తోంది. ఇరాన్, అమెరికా- ఇజ్రాయెల్ శాంతి ఒప్పందంలో పాకిస్థాన్, ఖతార్‌లు పాల్గొంటే.. ఆ చర్చల్లో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలనూ చేర్చుకోవాలి. మధ్యప్రాచ్యంలో ఆ మూడు దేశాలే అమెరికాకు నిజమైన మిత్రదేశాలు' అని పేర్కొన్నారు. కాగా, వీరి వ్యాఖ్యలు ఇప్పటికే ఉన్న వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లు అయ్యింది.

# వరుస తనిఖీలు చేసినా కానరాని మార్పులు

## రెస్టారెంట్లలో అదే అపరిశుభ్రత..

## ఫ్రీజర్లలో కాలం చెల్లిన పదార్థాలు

## కంచి కేఫ్, కోడికూర చిట్టిగారెకు నోటీసులు

హైదరాబాద్,జూన్23 (ప్రజా వీక్షణం)

హైదరాబాద్ పరిధిలోని రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న రెండు ప్రముఖ రెస్టారెంట్లలో నిబంధనల ఉల్లంఘనలను, తీవ్రమైన లోపాలను గుర్తించి నోటీసులు జారీ చేశారు. పుప్పాలగూడలోని కంచి కేఫ్‌లో నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. కిచెన్, స్టోర్ రూమ్ మధ్య ఓపెన్ డస్ట్‌బిన్లు ఉండటంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసన వస్తూ, ఈగలు ముసురుతున్నాయి. స్టోర్ రూమ్ సీలింగ్‌పై దుమ్ము పేరుకుపోగా.. గ్రైండింగ్, కూరగాయలు కట్ చేసే ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండి అపరిశుభ్రంగా మారింది. అంతేకాకుండా, వంటకు ఉపయోగించే కాలీఫ్లవర్‌పై ఫంగస్ పెరిగినట్లు అధికారులు గుర్తించారు. డ్రెయిన్ల వద్ద దుర్వాసన రావడం, ఫ్రిజ్‌లలో నిల్వ చేసిన పిండిపై ఎలాంటి లేబులింగ్ లేకపోవడం గమనించారు. వంటగది, స్టోర్ రూమ్‌లలో ఈగలు, బొద్దింకలు తిరుగుతుండటంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటికి తోడు మెడికల్ ఫిట్‌నెస్, పెస్ట్ కంట్రోల్, వాటర్ టెస్టింగ్, ప్యాకేజింగ్ మెటీరియల్ టెస్టింగ్‌కు సంబంధించిన ఎలాంటి రికార్డులు రెస్టారెంట్ యాజమాన్యం వద్ద అందుబాటులో లేవు. దీంతో ఫుడ్ లేబులింగ్, హౌస్‌కీపింగ్ వెంటనే మెరుగుపరచాలని ఆదేశిస్తూ అధికారులు నోటీసులు ఇచ్చారు. నల్లగండ్లలోని కోడికూర చిట్టిగారె రెస్టారెంట్‌లోనూ తనిఖీలు కొనసాగాయి. ఇక్కడ నిల్వ ఉంచిన చికెన్, డెజర్ట్స్‌పై ఎలాంటి లేబుల్స్ లేవని అధికారులు గుర్తించారు. ఆ లేబుల్స్ లేని ఆహార పదార్థాలను అక్కడికక్కడే పారవేయించారు. గ్రైండింగ్ ఏరియా సీలింగ్‌పై దుమ్ము పేరుకుపోవడంతో పాటు కిచెన్ సీలింగ్ అంతా పూర్తిగా జిడ్డుగా మారినట్లు కనుగొన్నారు. ఆ జిడ్డును వెంటనే శుభ్రం చేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ రెస్టారెంట్‌లోనూ ఉద్యోగుల మెడికల్ ఫిట్‌నెస్, ప్యాకేజింగ్ మెటీరియల్ టెస్టింగ్ రికార్డులు లేకపోవడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు తీవ్రంగా పరిగణించి నోటీసులు జారీ చేశారు.

# 60 ఏళ్ల ప్రయాణంలో శివసేన అంతర్ధాన దశ

## ఉద్ధవ్ స్వయంకృతంతో పార్టీకి ముప్పు

## తండ్రి ఆశయాలు కాపాడడంలో పూర్తిగా విఫలం

ముంబై,జూన్23 (ప్రజా వీక్షణం)

మహారాష్ట్రలో బలంగా నిలిచిన శివసేన కథ ఇంక కంచికేనా అన్న చర్చ సాగుతోంది. బాణంలా దూసుకుని వచ్చిన బాల్ ఠాక్రే స్థాపించిన 'శివసేన' సరిగ్గా 60 వసంతాలు పూర్తి చేసుకుని వజ్రోత్సవ వేడుకలకు సిద్ధం అవుతున్న వేళ..అంతర్ధానానికి దగ్గరవుతోంది. యాదృచ్ఛికమే అయినా 60 వసంతాల పార్టీ ఇలా కావడం స్వయంకృతమే. 1966 జూన్ 19న ముంబైలోని చారిత్రాత్మక శివాజీ పార్క్‌లో బాల్ ఠాక్రే కొబ్బరికాయ కొట్టి ఈ పార్టీని ప్రారంభించారు. నాడు కొద్దిమంది మద్దతుదారులు, వేలాది మంది 'మరాఠీ మానుస్' సాక్షిగా పురుడుపోసుకున్న ఈ ప్రాంతీయ మహావృక్షం.. రెక్కలు విరిగాయి. నేలకొరగడానికి సిద్ధంగా ఉంది. విచిత్రమేమిటంటే.. బాల్ ఠాక్రే స్థాపించిన అసలైన 'శివసేన' పేరు, దాని సాంప్రదాయక 'విల్లు-బాణం' గుర్తు ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే వశమయ్యాయి. మరోవైపు ఉద్ధవ్ ఠాక్రే వద్ద తండ్రి పెట్టిన పార్టీ పేరు కానీ, గుర్తు కానీ మిగల్లేదు. వారి పార్టీ ఇప్పుడు 'శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే)'గా రూపాంతరం చెంది, 'మశాల్' (దివిటీ) గుర్తుతో మనుగడ సాగిస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆ దివిటీ సైతం దాదాపు ఆరిపోయే స్థితికి చేరుకుంది. శివసేనను స్థాపించినప్పుడు బాల్ ఠాక్రే రెండు ప్రధాన ఆశయాలను నిర్దేశించుకున్నారు. ఒకటి 'మరాఠీ అస్తిత్వం', రెండోది 'హిందుత్వ సిద్ధాంతం'. కానీ నేడు ఉద్ధవ్ ఠాక్రే తన తండ్రి నుంచి వచ్చిన ఈ రెండు రాజకీయ వారసత్వాలను కాపాడుకోవడానికి తీవ్రంగా పోరాడాల్సి వస్తోంది. బాల్ ఠాక్రే హయాంలో శివసేన సాధించిన శిఖరాగ్రాల నుంచి ఉద్ధవ్ హయాంలో ఎదుర్కొంటున్న జీవన్మరణ పరిస్థితి వరకు అనేక ఆటుపోట్లు ఎదుర్కొంది. 1992 జూలై 18న శివసేనలో జరిగిన ఘటన సంచనలంగా మారింది. బాల్ ఠాక్రే పార్టీని ఒక సొంత ఆస్తిలా చూస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో కలత చెందిన బాల్ ఠాక్రే, పార్టీ ముఖపత్రం 'సామ్నా'లో ఒక వ్యాసం రాస్తూ.. తాను శివసేన నుంచి తప్పుకుంటున్నట్లు సంచలన ప్రకటన చేశారు. ఈ వార్తతో మహారాష్ట్రవ్యాప్తంగా ఉన్న శివసైనికుల్లో తీవ్ర కలకలం



రేగింది. ముంబైలోని శివసేన ప్రధాన కార్యాలయం వెలుపల లక్షలాది మంది సైనికులు తరలివచ్చి.. 'బాలాసాహెబ్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి' అని కన్నీటితో వేడుకున్నారు. శివసైనికులకు తనపై ఉన్న ఆ అచంచలమైన ప్రేమాభిమానాలను చూసి బాల్ ఠాక్రే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోక తప్పలేదు. బాల్ ఠాక్రే బతికున్నంత కాలం మహారాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువు వారి నివాసమైన 'మాతోశ్రీ' మాత్రమే. శివసేన అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. ముంబై నగర రిమోట్ కంట్రోల్ బాలాసాహెబ్ చేతుల్లోనే ఉండేది. 'మాతోశ్రీ' నుంచి చిన్న సంకేతం వస్తే చాలు.. ముంబై స్థంభించిపోయేది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం స్వయంగా ముంబై పోలీసులు సైతం శివసేన ప్రముఖుడిని అభ్యర్థించాల్సిన పరిస్థితి ఉండేది. కోవిడ్ లాక్‌డౌన్ కంటే ముందే.. ముంబై లోకల్ రైళ్లకు బ్రేక్ వేయగల ఏకైక శక్తి బాల్ ఠాక్రేకే ఉండేదని ఇప్పటికీ ముంబై ప్రజలు చెప్పుకుంటారు. కానీ, నేడు బాల్ ఠాక్రే శతాబ్ది జయంతి ఉత్సవాల వేళ, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని పార్టీ రెండోసారి ఘోరమైన చీలికను ఎదుర్కొంటోంది. ఆయన కుడిభుజం పరిమితమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజావీక్షణం
దినపత్రిక

# సీనియర్ పాత్రికేయుడు కోలాటి మోషే బాబుకు మాతృవియోగం

## - లక్ష్మీకాంతం పార్థివదేహానికి నివాళులర్పించిన విలేకరులు

తాడేపల్లిగూడెం ప్రతినిధి జూన్ 23 (ప్రజా వీక్షణం)





సీనియర్ జర్నలిస్టు, ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యుడు కోలాటి మోషే బాబు మాతృమూర్తి కోలాటి లక్ష్మీ కాంతం (80) మంగళవారం పరమ పదించారు. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామానికి చెందిన లక్ష్మీకాంతం భర్త ఇజ్రాయిల్ భారత సైన్యంలో పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె మరణం పట్ల తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ (ఏ.పి.యూ.డబ్ల్యూ.జె) తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో మంగళవారం జరిగిన ప్రెస్ క్లబ్ సమావేశంలో ఐజేయు సెక్రటరీ జనరల్ దూసన పూడి సోమసుందర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎడ్లపల్లి మురళి, జిల్లా కార్యదర్శి గజపతి వరప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలడుగుల సతీష్, జర్నలిస్టులు షేక్ ఖాదర్ మొహిద్దీన్, చిక్కాల రామకృష్ణ, మైలవరపు రవి, పెద్దోజు మురళి, కాకర్లమూడి శ్రీను, శీలి మహేష్, కాసాని వెంకటరత్నం, వానపల్లి పుండరికాక్షుడు, అయితం ప్రసాద్, మణికంఠ, నాని, గారపాటి ప్రసాద్ , చింతకాయల దొరబాబు, గంటా శివ, కే.నాగేశ్వరరావు, టి.నాగేశ్వరావు, సింగలూరి వీర్రాజు భాష్యంశెట్టి బాల బాలాజీ, కలింగ లక్ష్మణరావు, ఆలీ, సురగాల రాంబాబు, కమల్, కళ్యాణ్, చిట్రోజు కృష్ణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొని సంతాపం తెలియజేశారు. అనంతరం ఐజేయు సెక్రటరీ జనరల్ దూసనపూడి సోమ సుందర్ ఆద్వర్యంలో పలువురు విలేకరులు ఆరుగొలనులోని వారి స్వగృహం వద్ద ఏర్పాటుచేసిన లక్ష్మీకాంతం పార్దేవదేహాన్ని సందర్శించి ఘన నివాళులు అర్పించారు. లక్ష్మీ కాంతం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఎస్ఐఆర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## - అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో నమోదు కావాలి
## - జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్వోల ఇంటింటి సర్వే
## - అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణ
## - జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద






ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)



ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐ ఆర్) కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల ని వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద పిలుపు నిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లా డుతూ, ఓటరు జాబితాను లోపర హితంగా, సమగ్రంగా రూపొందించడ మే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి పౌరుడు తప్పని సరిగా ఓటరు జాబితాలో నమోదు కావాలని సూచించారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించి, అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామ ని చెప్పారు. జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు నోటీసు ల జారీ, క్లెయిమ్స్, అభ్యంత రాల పరిశీలన, పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని, అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్న ట్లు వెల్లడించారు. వరంగల్ జిల్లాలోని నర్సంపేట, వర్ధన్న పేట, వరంగల్ తూర్పు నియోజక వర్గాల పరిధిలో మొత్తం 799 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఎస్ఐఆర్ కార్య క్రమ నిర్వహణలో బీఎల్వోల తో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బీఎల్ఏలు కూడా సమన్వయంతో పని చేస్తారని పేర్కొన్నారు.ఓటరు జాబితాను సమగ్రంగా పరిశీలించి అర్హులైన ప్రతి పౌరుడి పేరును నమోదు చేయడం, అనర్హుల పేర్లను తొలగించడం, అవసరమైన సవరణలు చేపట్టడం జరుగు తుందని కలెక్టర్ వివరించా రు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరించడం, కొత్తగా అర్హు లైన ఓటర్లను గుర్తించడం, మరణించిన లేదా శాశ్వతం గా ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లిన వారి వివరాలను నమోదు చేయడం జరుగు తుందన్నారు. ప్రస్తుతం ఓటర్ల ధ్రువీకరణ ప్రక్రియ కొనసాగు తోందని, ప్రతి ఇంటికి ముందుగా ముద్రించిన ఎన్యుమరేషన్ ఫారాలను రెండు ప్రతులుగా అందజేసి వాటిని ఎలా పూరించాలో మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ ప్రాంతా ల్లో నమోదైన ద్వంద్వ ఓటర్ల ను గుర్తించి, ఎన్నికలసంఘం నిబంధనల మేరకు విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఇంటికి తాళం వేసి ఉన్న సందర్భాల్లో బీఎల్వోలు మూడు సార్లు సందర్శించి వివరాలు సేకరిస్తారని తెలి పారు. ఎస్ఐఆర్ కార్యక్రమం విజయ వంతానికి ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులు సహకరించాల ని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బి. సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జిల్లా పౌర సంబంధాల అధికారి బి. ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

# బాలవికాస ఆధ్వర్యంలో అంతర్జాతీయ వితంతుల దినోత్సవం






ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)

హసన్‌పర్తి మండలంలోని చింతగట్టు గ్రామంలో బాల వికాస సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ వితంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా బాలవికాస కోఆర్డినేటర్ అలువాల శోభ మాట్లాడు తూ, గతంలో సమాజంలో ఉన్న మూఢాచారాలు, మూఢనమ్మకాల కారణంగా భర్తను కోల్పోయిన మహిళ లు అనేక ఇబ్బందులు ఎదు ర్కొన్నారని అన్నారు. అటువంటి ఆచారాలను నిర్మూలిం చేందుకు సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ చేసిన కృషిని గుర్తు చేశారు. భర్త మరణించిన మహిళలను వితంతువులు గా వేరు చేయాలని ఏ మత గ్రంథంలోనూ పేర్కొనలేదని, హిందూ, క్రైస్తవ, ముస్లిం మత పెద్దలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారని తెలిపారు. వితంతువులను సమాజంలో గౌరవంగా చూడాలని, వారిని అన్ని శుభకార్యాల్లో భాగస్వాము లను చేయాలని పిలుపు నిచ్చారు. బాలవికాస వ్యవస్థాపకురాలు బాలమ్మ ప్రేరణ తో భర్తను కోల్పోయిన మహి ళలకు బొట్టు, పువ్వులు, గాజులు, చీరలు అందజేస్తూ వారికి గౌరవప్రదమైన స్థానం కల్పిస్తున్నామని చెప్పారు. అనంతరం గ్రామంలో అవ గాహన ర్యాలీ నిర్వహించి, వితంతుల పట్ల వివక్షను రూపుమాపాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బాలవికాస మహిళా గ్రూప్ నాయకులు కన్నం లలిత, రాజారపు పద్మ, నమిండ్ల రాణి, నదునూరి సంపూర్ణ లత, కోఆర్డినేటర్లు బరిగెల రమ, అలువాల శోభ, పుల్ల పద్మ, గ్రామ పెద్దలు, గ్రామస్తు లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ రుణాలను విడుదల చేయాలని కోరుతూ మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవికి వినతిపత్రం అందజేసిన దళిత సేన నాయకులు

తాడేపల్లిగూడెం ప్రతినిధి జూన్ 23 (ప్రజా వీక్షణం)

ఏలూరు నగరంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం సందర్శనకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే, మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవిని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్, దళిత సేన ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, ఏలూరు జిల్లా దళిత సేన ప్రధాన కార్యదర్శి పింగుల ఈదియా మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో విద్యావంతులైన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నిరుద్యోగ యువతకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను వెంటనే విడుదల చేసి, వారి ఆర్థిక జీవనాధారం కల్పించాలని చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి సబ్సిడీ రుణాలు త్వరితగతిన మంజూరు చేసేలా కృషి చేయాలని దళిత సేన నాయకులు కోరారు. ముందుగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.




# ఎంజేపీ జయగిరి పాఠశాల లో యాంటీ-డ్రగ్స్ అవగాహ న సదస్సు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్స వం (జూన్ 26)ను పురస్కరించుకుని హసన్ పర్తి మండల పరిధిలోని జయగిరి మహాత్మా జ్యోతిబా పూలే (ఎంజేపీ) గురుకుల పాఠ శాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై మంగళవారం ప్రత్యేక అవ గాహన సదస్సు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి సీఐ ఎ.మహేంద ర్, ఎస్ఐ దేవేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్ మాట్లాడుతూ, యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, “సే నో టు డ్రగ్స్ సే యెస్ టు లైఫ్” అనే నినాదాన్ని జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల సరఫరా లేదా వినియోగానికి సంబంధించి న సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాల ని, ఇందుకోసం ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ తెలంగా ణ టోల్‌ఫ్రీ నంబర్ 1908 గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉంటామ ని, సమాజాన్ని మాదక ద్రవ్యాల రహితంగా మార్చేందుకు ‘యాంటీ డ్రగ్ సోల్జర్స్’గా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపా ల్, అధ్యాపక బృందం, పోలీసు సిబ్బంది ప్రతి నిధులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు.పోలీసుల వివరాల ప్రకారం, వంగపహాడ్ గ్రామానికి చెందిన రైతు మద్దెల చిన్న రవీందర్ (60) సోమవారం సాయంత్రం తన హీరో స్ప్లెండర్ ప్లస్ బైక్‌పై హసన్ పర్తి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో వంగపహాడ్ గ్రామ సమీపంలోని ఓఆర్ఆర్ క్రాస్ రోడ్ వద్ద యూ–టర్న్ తీసు కుంటుండగా, ములుగు వైపు నుంచి హైదరాబాద్ దిశగా అతివేగంగా వస్తున్న మరో బైక్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్న రవీందర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థాని కులు వెంటనే హనుమకొండ లోని ఎన్ఎస్ఆర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందు తూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన బైక్‌ను మడి కొండ గ్రామానికి చెందిన ఒగ్గు జగదీష్ (22) నడుపుతున్న ట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి కుమారుడు మద్దె ల రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హసన్ పర్తి ఎస్ఐ ఎస్. రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

GENERAL NEWS
24 బుధవారం, జూన్ 2026
www.prajaveekshanam.in

## ఎంఎస్ఎంఈ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)**

అంతర్జాతీయ ఎంఎస్ఎంఈ దినోత్సవాన్ని పురస్కరించు కుని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) హైదరా బాద్ ఆధ్వర్యంలో హనుమ కొండలోని వారాహి ఫంక్షన్ హాలులో ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు నిర్వ హించారు. కార్యక్రమానికి ఆర్‌బీఐ హైదరాబాద్ ప్రాంతీయ సంచాలకులు చిన్మయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని చేనేత, హస్త కళలు, తివాచీలు, ఇత్తడి కళాకారులు, టసర్ సిల్క్ క్లస్టర్ల అభివృద్ధికి అవసర మైన బ్యాంకింగ్, ప్రభుత్వ పథకాలు, మార్కెటింగ్ అవకాశాలపై చర్చించారు. నాబార్డ్ ఆధ్వర్యంలో అమల వుతున్న అభివృద్ధి కార్య క్రమాలను వివరించగా, బ్యాంకు రుణాలు, బ్రాండింగ్, డిజిటల్ ప్రచారం, మార్కెట్ అనుసంధానంపై నిపుణులు అవగాహన కల్పించారు. వివిధ శాఖల అధికారులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు, కళాకారులు, నేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## మైనర్లకు వాహనం ఇచ్చి చట్టపరమైన చిక్కుల్లో పడోద్దు

### - వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)**

వాహనదారులు మైనర్లకు వాహనం అందజేసి వారి కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాలకు వాహన యజమాని చట్టపరమైన చిక్కుల్లో పడోద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిష నరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రతి పోలీసు అధికారి నిరంతరం కృషి చేయడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం, కార్యక్రమాల ను నిర్వహిస్తున్న కొంత మంది వాహన దారుల బాధ్య తరాహిత్య కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతునే వున్నాయి. ప్రధానం ఈ రోడ్డు ప్రమాదాలు అధికంగా మైనర్ వాహన దారుల కారణంగా అధికంగా జరుగు తున్నాయి. గత రెండు రోజుల క్రితం పర్వతగిరి పోలీస్ స్టేషన్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వృద్దులతో పాటు, ఒక మైనర్ బాలుడు మర ణించగా, మరో మైనర్ బాలుడు తీవ్ర గాయలతో ప్రస్తుతం చికిత్స పోందుతు న్నాడు. ఈ రోడ్డు ప్రమాదాని కి ప్రధాన కారణంగా మైనర్ బాలుడు అతి వేగంగా వాహనం నడుపుతూ ఇద్దరు వృద్దులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని అతి వేగంగా ఢీ కోట్టడం కారణం గానే సంఘటన స్థలంలోనే మైనర్ బాలుడితో పాటు ఏ పాపం ఎగురుగని ఇద్దరు వృద్దులు మరణిం చారు. ఈ సంఘటన చాలా బాధ కరమై న విషయం. ఈ సంఘటనపై ప్రతి ఒక్కరు ఆలోచించాల్సి న విష యమని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఇలాంటి రోడ్డు ప్రమాదాలను నివారిం చాలంటే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలకు కట్టుబడి వుండాలని, ముఖ్యంగా మైనర్లకు వాహనం అంద జేయడం చట్టరీత్యా నేరమ ని, ఇలా మైనర్లకు వాహనం అందజేయడం ద్వారా మైనర్ల డ్రైవింగ్ కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాలకు వాహన యజమాని లేదా మైనర్ తల్లిదండ్రులు బాధ్యులుగా చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో వారిని జైలుకు తరలించడం జరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ వాహన దారులను హెచ్చరించారు. ఇకనైన వాహనదారులు తమ వాహనదారులు




మైనర్ డ్రైవర్లకు వాహనాలు అంద జేయడం లేదా వారిని ప్రోత్స హించవద్దని పోలీస్ కమిషన ర్ వాహనదారులకు హితవు చేసారు.

## ఉప్పరల్లి పరిసరాల్లో పులి కలకలం !

### - నది దాటి ఏలూరు జిల్లాలోకి ప్రవేశించిన వన్యమృగం
### - దండోరా, మైకుల ద్వారా ప్రజలకు అధికారుల హెచ్చరికలు
### -అప్రమత్తమైన అటవీ శాఖ .. రంగంలోకి ప్రత్యేక బృందాలు

**పోలవరం, జూన్ 23 (ప్రజా వీక్షణం):**

గత కొంతకాలంగా అటవీశాఖ అధి కారుల నిరంతర పర్యవేక్షణలో ఉన్న పులి, తాజాగా నది దాటి పోలవరం జిల్లా నుండి ఏలూరు జిల్లా పరిధిలోకి ప్రవేశించింది. ప్రస్తుతం ఈ పులి ఉప్పారేల్లి పరిసర ప్రాంతాలలో సంచరి స్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారని జిల్లా అటవీ శాఖాధికారి (డి.ఎఫ్.ఓ) పి. వి. సందీప్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. అటవీ శాఖ అన్ని రకాల ముందస్తు రక్షణ చర్యలను చేపట్టిందని, ఈ నేపథ్యంలో ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

**11 గ్రామాల్లో 'టాం టాం' ప్రకటనలు..**

పులి సంచరిస్తున్న ఉప్పారేల్లి పరిసర ప్రాంతాలైన ముంజులూరు, కోటూరు పల్లి, చానపల్లి, లంకపాకాల, వీరన్న పాలెం, పులిరాముడుగూడెం, రవ్వవారి గూడెం, చింతలగూడెం, పాలకుంట, కుంకాల, గోగుమిల్లిలిలి గ్రామ ప్రజలను 'టాం టాం' (దండోరా) మరియు మైక్ అనౌన్స్మెంట్ల ద్వారా ఇప్పటికే అప్రమత్తం చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.

**రంగంలోకి బోన్లు, వెటర్నరీ బృందాలు**

పులిని పట్టుకోవడానికి వీలుగా ప్రభా విత గ్రామాల సమీపంలో వేర్వేరు



ప్రత్యేక టీమ్ లను ఏర్పాటు చేశాం. ఇందుకోసం అవసరమైన బోన్లు (కేజెస్), రవాణా సౌకర్యాలు (లాజిస్టిక్స్) మరియు వెటర్నరీ (పశు వైద్య) బృందాలను సిద్ధంగా ఉంచడం జరిగింది. పులి సంచారాన్ని నిశితంగా పరిశీలిస్తున్నాం. అవసరమైతే నిపుణుల సమక్షంలో దానికి సురక్షితంగా మత్తుమందు ఇచ్చి పట్టుకునేందుకు శ్రమిస్తున్నాం అని పి. వి. సందీప్ రెడ్డి, జిల్లా అటవీ శాఖాధికారి తెలిపారు.

**ప్రజలకు అటవీ శాఖ జారీ చేసిన ముఖ్యమైన సూచనలు:**

– జీవాల రక్షణ: పులి జనావాసాలకు దగ్గరగా ఉన్నందున, రాత్రి సమయాల్లో పశువులను, జీవాలను



ఇంటి బయట (బహిరంగ ప్రదేశాల్లో) కట్టేయకూడదు.

– మేతకు వెళ్లొద్దు: ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరూ కూడా పశువుల మేత కోసం (గ్రాజింగ్) అడవి లేదా పోడు ప్రాంతాలకు వెళ్లకూడదు.

– లైట్లు ఆన్ చేయండి:లి గ్రామస్తులందరూ రాత్రి వేళల్లో ఇళ్ల వద్ద, పశువుల పాకల వద్ద లైట్లు ఆన్ చేసి ఉంచాలి.

**ఉన్నతాధికారుల నిరంతర నిఘా**

ఉప ముఖ్యమంత్రి (డిప్యూటీ సీఎం) ఆదేశాల మేరకు, అలాగే అటవీ శాఖ ఉన్నతాధికారుల మార్గదర్శకాల ప్రకారం జిల్లా మరియు మండల స్థాయి యంత్రాంగం అంతా అత్యంత అప్రమత్తంగా ఉందన్నారు. ప్రస్తుతం జిల్లా అటవీ శాఖ అధికారి, సబ్-డిఎఫ్ఓ మరియు ఫీల్డ్ స్టాఫ్ అందరూ ఉప్పారేల్లి ప్రాంతంలోనే రాత్రి బస చేసి పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు. అటవీ శాఖ సిబ్బంది స్థానిక ప్రజలను సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షి స్తున్నారని, ప్రజలు అధికారులకు సహకరించి సురక్షితంగా ఉండ వలసిందిగా డి.ఎఫ్.ఓ కోరారు.

## నగర పార్కుల అభివృద్ధికి ఆధునిక నమూనాలు రూపొందించాలి

### - కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)**

నగరంలోని పార్కులను ప్రజలకు మరింత ఆకర్ష ణీయంగా, ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు ఆధునిక డిజైన్లతో అభివృద్ధి చేయాల ని హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి సూచించారు. మంగళవారం డబ్ల్యూఆర్ఐ ప్రతినిధులు, జీడబ్ల్యూఎంసీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ బాలసముద్రం చిల్డ్రన్స్ పార్కు తరహాలో కీర్తినగర్ పార్కుతో పాటు ఇతర పార్కులు, అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాల ని సూచించారు. పచ్చదనం పెంపు, పిల్లల వినోదం, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంలో పార్కుల అభివృద్ధి కీలకమ ని పేర్కొన్నారు. సమావేశం లో డబ్ల్యూఆర్ఐ, జీడబ్ల్యూ ఎంసీ అధికారులు పాల్గొన్నారు.



## ఫుడ్ కోర్టులను పరిశీలించిన కమిషనర్ ఏసుబాబు

**తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 23 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం పట్టణంలోని ఎస్వీఆర్ విగ్రహం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టులను పురపాలక సంఘం కమిషనర్ ఎం.ఏసుబాబు మంగళవారం సందర్శించి, అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని అందించేందుకు వీలుగా ఎస్వీఆర్ విగ్రహం వద్ద ఆధునిక ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటితోపాటు జీవి మాల్ దగ్గర ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని కూడా ప్రతిష్టించామని చెప్పారు. ఈ రెండు ప్రాజెక్టులను ఈ నెల 25న పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని చెప్పారు. ఫుడ్ కోర్ట్‌లో పరిశుభ్రత, వెంటిలేషన్, అన్ని సౌకర్యాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. ఛత్రపతి శివాజీ విగ్రహం చుట్టూ ప్రకాశవంతమైన లైటింగ్, అందమైన ఫౌంటెన్ సిద్ధం చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ వెంకట రమణ, ఇతర పురపాలక సంఘ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## గోపాల్‌పూర్ ఊరచెరువు అభివృద్ధి పనులు వేగ వంతంగా పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి





**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)**

గోపాల్‌పూర్ ఊరచెరువులో కొనసాగు తున్న డీసిల్టేషన్ (పూడిక తొలగింపు), రీటైనిం గ్ వాల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల ని జిల్లా కలెక్టర్ గ్రేటర్ వరంగ ల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమ కొండలోని గోపాల్ పూర్ ఊర చెరువును సంద ర్శించిన కలెక్టర్, అక్కడ కొన సాగుతున్న డీసిల్టేషన్, రీటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలిం చారు. పనుల నాణ్యత, వేగంపై ఇరిగేశాన్ జీడబ్ల్యూఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో చెరువు అభివృద్ధి పనులకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అదనపు యంత్రాలు, సిబ్బందిని వినియోగించి డీసిల్టేషన్ రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులను ఈ వారం లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. చెరువుల పునరుద్ధరణ ద్వారా వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టం మెరుగుపడుతుంద ని, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగు తాయని కలెక్టర్ పేర్కొన్నా రు. పనుల నాణ్యత విషయంలో రాజీపడ కుండా, నిరంతర పర్యవేక్షణతో చేపట్టాలని అధికారులకు సూచిం చారు. ఈ పరిశీలన లో జీడబ్ల్యూఎంసీ ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ రవి కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ తహసీల్దార్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూమి సారాన్ని కాపాడడంలో ఇన్‌పుట్ డీలర్లు కీలక పాత్ర పోషించాలి

## - కృషి విజ్ఞాన కేంద్రం విభాగాధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సి.హెచ్.కిరణ్ కుమార్

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 23 (ప్రజా వీక్షణం)

రైతులకు శాస్త్రీయ సలహాలు అందించి భూమి సారాన్ని కాపాడడంలో ఇన్‌పుట్ డీలర్లు కీలక పాత్ర పోషించాలని కృషి విజ్ఞాన కేంద్రం విభాగాధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సి.హెచ్. కిరణ్ కుమార్ సూచించారు. తాడేపల్లి గూడెం మండలం వెంకట్రామన్న గూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఇన్‌పుట్ డీలర్లకు ( డీఏఈఎస్ఐ) ఖేత్ బచావో అభియాన్ పై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిధి సీనియర్ శాస్త్రవేత్త కిరణ్ కుమార్ మాట్లాడుతూ అధిక రసాయన ఎరువుల వినియోగం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటోందని, నేల పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించడం ద్వారా పంట దిగుబడులతో పాటు నేల సారాన్ని కూడా కాపాడవచ్చున్నారు. రైతులకు సరైన సలహాలు అందించడంలో ఇన్‌పుట్ డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఉద్యాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఈ. రేఖ మాట్లాడుతూ సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ పదార్థాల వాడకం, సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యత గురించి వివరించారు. మత్స్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఏ.దేవివరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వనరుల పరిరక్షణతో కూడిన సుస్థిర వ్యవసాయ



విధానాలను రైతులకు చేరవేయాలని వివరించారు.వ్యవసాయ విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె.అర్చన మాట్లాడుతూ ఖేత్ బచావో అభియాన్ లక్ష్యాలు, నేల ఆరోగ్య పరిరక్షణలో రైతులు, ఇన్‌పుట్ డీలర్ల భాగస్వామ్యం గురించి అవగాహన కల్పించారు. భూమిని కాపాడితేనే భవిష్యత్ తరాలకు సురక్షితమైన ఆహార భద్రత సాధ్యమవుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో దాదాపు 108 మంది డీఏఈఎస్ఐ ఇన్‌పుట్ డీలర్లు పాల్గొని ఖేత్ బచావో అభియాన్ సందేశాలను రైతులకు విస్తృతంగా చేరవేస్తామని తెలిపారు.

# అగ్నిమాపక భద్రత, అత్య వసర ప్రతిస్పందనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించిన ఎన్ఐటీ వరంగల్





ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)

జాతీయ సాంకేతిక విద్యా సంస్థ వరంగల్ (ఎన్ఐటీ వరంగల్) తన ఉద్యోగులు, పరిశోధన విద్యార్థులు విద్యార్థుల కోసం 2026 జూన్ 23న "అగ్నిమాపక భద్రత అవగాహన, శిక్షణ కార్య క్రమం"ను నిర్వ హించింది. ఈ కార్యక్రమాన్ని ఎన్ఐటీ వరంగల్‌లోని సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ తెలంగాణ అగ్నిమాపక, విపత్తు ప్రతి స్పందన, అత్యవసర సేవలు పౌర రక్షణ శాఖ సహకారం తో నిర్వహించింది. సంస్థలో అగ్నిమాపక భద్రతపై అవ గాహన పెంపొందించడం అత్యవసర పరిస్థితుల్లో స్పందన సామర్థ్యాన్ని మెరుగుపరచడం ఈ కార్యక్రమం ఉద్దేశ్యం. ఈ సందర్భంగా ఎన్ఐటీ వరంగల్ విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ ప్రొఫెసర్ కె. కిరణ్ కుమార్ మాట్లాడు తూ, సమష్టి బాధ్యత ముందస్తు జాగ్రత్తల ద్వారా సురక్షిత మైన క్యాంపస్ వాతావరణాన్ని నిర్మిం చడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. సీఆర్ఐఎఫ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎ. వీరేశ్ బాబు మాట్లా డుతూ, ఇటువంటి సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు సంస్థలో భద్రతా సంస్కృతిని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.హనుమకొండ జిల్లా అగ్ని మాపక అధికారి సుదర్శన్ రెడ్డి వనరుల వ్యక్తిగా (రిసోర్స్ పర్సన్‌గా) పాల్గొని అగ్నిమాపక భద్రతపై అవ గాహన కల్పించారు. అలాగే అగ్నిమాపక పరికరాల విని యోగంపై ప్రాయోగిక ప్రదర్శ నలు నిర్వహించి పాల్గొనే వారికి శిక్షణ అందించారు. ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్ డి. రవీందర్ రెడ్డి కార్యక్రమ లక్ష్యాలను వివరించడంతో పాటు, క్యాంపస్‌లో అగ్ని మాపక భద్రతా సన్నద్ధతను మరింత బలోపేతం చేయడా నికి సంస్థ చేపడుతున్న చర్యలను వివరిం చారు. టెక్నికల్ ఆఫీసర్ కార్యక్రమ సమన్వయకర్త డి. రవి కుమార్ తెలంగాణ అగ్ని మాపక, విపత్తు ప్రతిస్పంద న, అత్యవసర సేవలు పౌర రక్షణ శాఖ అందించిన సహ కారానికి, సంస్థ సభ్యుల చురుకైన పాల్గొనడానికి కృతజ్ఞతలు తెలిపారు.ఎన్ఐటీ వరం గల్ అగ్ని మాపక భద్రతా అధికారి కార్యక్రమ సమన్వయకర్త సజిత్ సంస్థలో అమలులో ఉన్న అగ్నిమాపక భద్రతా చర్యలు చేపడుతున్న కార్య క్రమాల గురించి పాల్గొనే వారికి వివరించారు.

# ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

- 80కి పైగా అంశాలకు గ్రీన్ సిగ్నల్
- వివిధ ప్రాంతాల్లో పెట్టుబడులకు పెద్దపీట
- పరిశ్రమలు, ఐటీ,పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లకు ప్రాధాన్యం
- రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన
- ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన
- జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయం
- అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు

అమరావతి,జూన్23 (ప్రజా వీక్షణం)

ఏపీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో 80కి పైగా అజెండా అంశాలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన సంబంధించిన నిర్ణయాలకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన, ఏపీ జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడం తదితర నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ, తిరుపతి, కర్నూలు, అన్నవరం ప్రాంతాల్లోనూ పర్యాటక ప్రాజెక్టులకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి మంత్రివర్గం అంగీకారం తెలిపింది. అనంతపురం, కడప జిల్లాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూముల కేటాయింపులు, బయోగ్యాస్ ఎ÷-లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మొదటి, రెండో దశ కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర కేబినెట్ శుభవార్త చెప్పింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్ల పెంపునకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, మెమో-57 ప్రకారం 2004 సంవత్సరానికి ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ నుంచి పాత పెన్షన్ విధానం అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపడంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా

## - ప్రభుత్వం జీవో విడుదల..చేతల ప్రభుత్వం అన్న లోకేశ్

అమరావతి,జూన్23 (ప్రజా వీక్షణం)

వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా ఇస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. 'యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలు ప్రత్యక్షంగా చూశా. నాటి పాదయాత్ర సమయంలో తమ కులవృత్తిని కొనసాగించేందుకు క్వారీలు కేటాయించాలని వ్డడెర సోదరులు నన్ను కలిశారు. ఆనాడు నేను ఇచ్చిన హామీ మేరకు క్వారీల్లో 33 శాతం వాటాను వ్డడెరలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 126 జారీ చేసింది.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 23 (ప్రజా వీక్షణం న్యూస్):

పేదింటి ఆడబిడ్డలకు అండ గా నిలుస్తూ పేదల సంక్షేమ మే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని 66వ డివిజన్ అధ్యక్షుడు కనిపర్తి కిరణ్ అన్నారు.మంగళవారం హసన్‌పర్తికి చెందిన లబ్ధిదారులకు రూ.76 లక్షల విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబా రక్ పథకాల చెక్కులను హసన్ పర్తి మండల తహ సీల్దార్ కిరణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా కనిపర్తి కిరణ్ మాట్లా డుతూ, పేద కుటుంబాల ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజ నాలు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వీశం సురేందర్ రెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్ ఆరేల్లి వెంకటస్వామి, మండల మీడియా ఇన్‌చార్జి బిగిళ్ల సురేష్, పెద్దమ్మ నరసింహారావు,గరిగ రాజు, గొర్రె కిరణ్, మాజీ సర్పంచ్ పుల్ల రవి తదితరులు పాల్గొన్నారు.



# 11వేల మంది ఉద్యోగులకు లబ్ది సీపీఎస్ అసోసియేషన్ హర్షం

అమరావతి,జూన్23 (ప్రజా వీక్షణం)

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఏపీ సచివాలయ సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ స్వాగతించింది. జ.వోనెం.57 అమలుపై సీపీఎస్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. కేబినెట్ నిర్ణయంతో రాష్ట్రంలోని 11 వేల మంది ఉద్యోగులకు లబ్ది చేకూరనుంది. వెటరన్, ఫ్యామిలీ అఖా కంట్రిబ్యూషన్‌పై స్పష్టతనిచ్చిన సర్కార్.. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం చూపించింది. ఉద్యోగుల గ్రాడ్యుటీ మేరకు ఫ్యామిలీ పెన్షన్ మంజూరుకు నిర్ణయం తీసుకుంది. దీంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు అఖా అసోసియేషన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అఖా అసోసియేషన్ పేర్కొంది. ఏపీ కేబినెట్ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఏపీఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్ అన్నారు. సీపీఎస్ నుంచి ఓపీఎస్‌లోకి మెమో 57 ప్రకారం 11 వేలమంది ఉద్యోగులకు మేలు జరిగిందన్నారు. ప్రభుత్వరంగ ఉద్యోగుల పదవి విరమణ వయసును 60 నుంచి 62కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. కేబినెట్ నిర్ణయంతో ఈరోజు ఉద్యోగుల కల నెరవేరిందన్నారు. అందుకే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు ఉద్యోగులు ధన్యవాదాలు తెలియజేస్తున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అంశాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించాలని విద్యాసాగర్ కోరారు.

# నిజామాబాద్ ఎక్సైజ్ అధికారి మల్లారెడ్డి అరెస్ట్

## నాంపల్లి కోర్టులో హాజరు పర్చిన అధికారులు

## సోదాల్లో భారీగా ఆస్తులు, నగదు గుర్తింపు

హైదరాబాద్,జూన్23 (ప్రజా వీక్షణం)

నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును ఏసీబీ నమోదు చేసింది. అనంతరం ఆయన్ను అరెస్ట్ చేసి నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరిచింది. అక్రమాలకు పాల్పడి ఆస్తులు సంపాదించినట్లు మల్లారెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని మచ్చబొల్లారం, నిజామాబాద్‌లోని ప్రగతినగర్‌లోని మల్లారెడ్డి నివాసాలతో పాటు ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ తనిఖీల్లో మల్లారెడ్డికి చెందిన పలు ఆస్తులను గుర్తించారు. 4 ఇళ్లు, ఒక వాణిజ్య భవనం, 8 ఖాళీ ప్లాట్లు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు తేల్చారు. ఆయన వద్ద సుమారు రూ.3.31లక్షల నగదు, రూ.50లక్షల బ్యాంకు నిల్వలు, మల్లారెడ్డి భార్య, కుటుంబ సభ్యుల పేర్లపై 3 బ్యాంకు లాకర్లు ఉన్నట్లు గుర్తించారు. విచారణలో భాగంగా వీటిని త్వరలో తెరవనున్నారు. సోదాల్లో గుర్తించిన మొత్తం ఆస్తుల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు రూ.3కోట్లుగా అంచనా వేశారు. మార్కెట్ విలువ ప్రకారం అనేక రెట్లు అధికంగా ఉండే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. మల్లారెడ్డిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పరిచిన అనంతరం రిమాండ్‌కు పంపారు.

# అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

## నిర్లక్ష్యపు కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలి

## రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ

రామగుండం,జూన్23 (ప్రజా వీక్షణం)

అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలనీ, పనుల్లో జాప్యం, నిర్లక్ష్యం చేసే కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలోని వివిధ పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పనుల నాణ్యత విషయంలో రాజీపడేది లేదన్నారు. క్షేత్ర స్థాయిలో పని పూర్తయిన తర్వాత సైట్ క్లియర్ చేసి రాకపోకలకు ఏలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చే అవకాశం లేకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని అన్నారు. తగిన కారణం లేకుండా పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో నగర పాలక సంస్థ ఏఈ తేజస్విని, అన్వేష్, టెక్నికల్ ఆఫీసర్ సౌమ్య, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక
SPORTS/ BUSINESS
24 బుధవారం, జూన్ 2026
www.prajaveekshanam.in

# వరుస ఫెయిల్యూర్స్ ఉన్నా ఫ్లెమింగ్‌కే ఓటు



ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో మోస్ట్ సక్సెస్ ఫుల్ ఫ్రాంచైజీ అయిన చెన్నై సూపర్ కింగ్స్ ఒక బిగ్ డెసిషన్ తీసుకుంది. ఐపీఎల్ 2026 సీజన్ లో ఘోరంగా ఫెయిల్ అయ్యాక కోచింగ్ స్టాఫ్ లో మార్పులు వస్తాయనే రూమర్స్ కు సీఎస్కే మేనేజ్‌మెంట్ ఎండ్ కార్డ్ వేసింది. తాజా రిపోర్ట్ ప్రకారం హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను పదవి నుంచి తొలగించే ఆలోచన సీఎస్కేకు లేదు. 2008 నుంచి ఈ ఫ్రాంచైజీతో ప్లేయర్‌గా అసోసియేట్ అయిన ఫ్లెమింగ్, 2009 నుంచి హెడ్ కోచ్‌గా సేవలు అందిస్తున్నాడు. ఐపీఎల్ 2025 లో లాస్ట్ ప్లేస్ లో నిలిచిన చెన్నై, ఐపీఎల్ 2026 లో ఎయిత్ ప్లేస్ కే పరిమితమైంది. దీంతో సోషల్ మీడియాలో "శాక్ ఫ్లెమింగ్" క్యాంపెయిన్స్ నడిచినా మేనేజ్‌మెంట్ మాత్రం అతనిపైనే నమ్మకం ఉంచింది. అతని కాంట్రాక్ట్ ను మరో సీజన్ కోసం ఎక్స్‌టెండ్ చేయనున్నారు. ప్రస్తుతం స్టీఫెన్ ఫ్లెమింగ్ అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ (మీజ) లో చెన్నై సబ్సిడరీ టీమ్ అయిన టెక్సాస్ సూపర్ కింగ్స్ కు హెడ్ కోచ్‌గా వర్క్ చేస్తున్నాడు. ఈ టోర్నీ ముగిసిన వెంటనే సీఎస్కే మేనేజ్‌మెంట్ ఐపీఎల్ 2026 పర్ఫార్మెన్స్ పై ఒక అఫీషియల్ రివ్యూ మీటింగ్ కండక్ట్ చేయనుంది. అక్కడే ఫ్లెమింగ్ కాంట్రాక్ట్ ఎక్స్‌టెన్షన్ పై అఫీషియల్ స్టాంప్ పడనుంది. సీఎస్కే తీసుకున్న ఈ డెసిషన్ వెనుక లెజెండ్ ఎమ్మెస్ ధోనీ ఇన్ఫ్లుయెన్స్ ఇంకా స్ట్రాంగ్ గా ఉందని స్పష్టంగా అర్థమవుతోంది. ధోనీ, ఫ్లెమింగ్ కాంబినేషన్ ఐపీఎల్ హిస్టరీలోనే మోస్ట్ సక్సెస్ ఫుల్ కెప్టెన్-కోచ్ పెయిర్ కావడంతో పాత స్ట్రక్చర్‌నే బ్యాక్ చేయాలని చెన్నై ఫిక్స్ అయింది. కాగా ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి ఖలీల్ అహ్మద్, డేవిడ్ మిల్లర్ ల మార్పిడి (స్వాప్) పై కొన్ని ఎంక్వైరీలు వచ్చినా చెన్నై దాన్ని తిరస్కరించింది. అలాగే హార్దిక్ పాండ్యా కోసం ఎలాంటి అప్రోచ్ జరగలేదని మేనేజ్‌మెంట్ స్పష్టం చేశాడు. మరోవైపు ఐపీఎల్ 2027 సీజన్ కు ముందే ఒక సంచలన ప్లేయర్ ట్రేడింగ్ ప్రాసెస్ స్టార్ట్ అయింది. లక్నో సూపర్ జాయింట్స్ నుంచి వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మళ్లీ తన పాత ఫ్రాంచైజీ అయిన ఢిల్లీ క్యాపిటల్స్ లోకి వెళ్లడం దాదాపు ఖాయమైంది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో లక్నో టీమ్ పంత్‌ను ఏకంగా రూ. 27 కోట్ల రికార్డ్ ప్రైస్ పెట్టి కొనుగోలు చేసింది. ఐపీఎల్ హిస్టరీలోనే ఇది అత్యంత ఖరీదైన బిడ్. కానీ లక్నో మేనేజ్‌మెంట్‌తో లీడర్‌షిప్ రోల్ పై వచ్చిన కొన్ని ఇష్యూస్ వల్ల పంత్ ఇప్పుడు లక్నోను వీడాలని డిసైడ్ అయ్యాడు. ఐపీఎల్ ట్రేడ్ విండో రూల్స్ ప్రకారం సీజన్ ముగిసిన ఒక నెల నుంచి నెక్స్ట్ వేలానికి ఒక వారం ముందు వరకు ఈ ప్లేయర్ల మార్పిడికి ఛాన్స్ ఉంటుంది. ఈ మెగా ట్రేడ్ లో భాగంగా రిషభ్ పంత్ ఢిల్లీ క్యాపిటల్స్ లోకి వస్తుండగా, అతని ప్లేస్ లో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జాయింట్స్ లోకి వెళ్లనున్నాడు. ఈ స్వాప్ డీల్ కోసం రెండు ఫ్రాంచైజీలు తీవ్రంగా డిస్కస్ చేస్తున్నాయని ఇన్సైడ్ సోర్స్ సమాచారం. అయితే పంత్ తీసుకునే అమౌంట్, కుల్దీప్ కోసం లక్నో చెల్లించే ప్రైస్ మనీకి సంబంధించిన ఫార్మాలిటీస్ ఇంకా పూర్తి కాలేదు. "రిషభ్-కుల్దీప్ స్వాప్ ట్రేడ్ జరుగుతున్న మాట నిజమే. రెండు ఫ్రాంచైజీలు ఇందులో బిజీగా ఉన్నాయి. కానీ ఫైనల్ అమౌంట్, మిగిలిన ఫార్మాలిటీస్ ప్రెజెంట్ బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ అప్రూవల్ కోసం పెండింగ్ లో ఉన్నాయి" అని ఈ డెవలప్‌మెంట్‌తో క్లోజ్ గా ఉన్న ఒక అఫీషియల్ సోర్స్ స్పష్టం చేశాడు. ఈ డీల్ కి గ్రీన్ సిగ్నల్ వస్తే ఐపీఎల్ 2027 లో ఇదే బిగ్గెస్ట్ ట్రేడ్ అవుతుంది.

# సచిన్ రికార్డుకు ఎసరు పెట్టిన జో రూట్



ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ జో రూట్ టెస్ట్ క్రికెట్ లో సరికొత్త హిస్టరీ క్రియేట్ చేశాడు. లండన్ నైట్‌క్లబ్ వివాదం వల్ల బెన్ స్టోక్స్ టీమ్‌కు దూరం అవ్వడంతో జో రూట్ మళ్లీ కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నాడు. ఓవల్ మైదానంలో న్యూజిలాండ్‌తో జరిగిన సెండ్ టెస్ట్ మ్యాచ్ లో కెప్టెన్సీ ప్రెజర్ ఉన్నప్పటికీ రూట్ బ్యాటింగ్‌లో రెచ్చిపోయాడు. ఈ మ్యాచ్ లో 46, 77 రన్స్ స్కోర్ చేయడం ద్వారా టెస్ట్ క్రికెట్ హిస్టరీలోనే సచిన్ టెండూల్కర్ తర్వాత 14,000 రన్స్ మార్కును దాటిన రెండో బ్యాటర్‌గా రికార్డ్ క్రియేట్ చేశాడు. దీంతో క్రికెట్ ప్రపంచంలో ఇప్పుడు ఒకే ఒక ఇంట్రెస్టింగ్ డిస్కషన్ నడుస్తోంది. సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 15,921 రన్స్ ఆల్ టైమ్ రికార్డును జో రూట్ బ్రేక్ చేయగలడా, అసలు ఆ రేర్ మైలురాయిని ఎప్పుడు అందుకుంటాడు అనే క్వశ్చన్ హాట్ టాపిక్‌గా మారింది. సచిన్ టెండూల్కర్ 2013 లో రిటైర్ అయినప్పుడు అతని 15,921 రన్స్ రికార్డ్ ఎవరూ బ్రేక్ చేయలేరని అందరూ అనుకున్నారు. అలిస్టర్ కుక్, విరాట్ కోహ్లీ, స్టీవ్ స్మిత్ లాంటి స్టార్స్ ట్రై చేసినా సచిన్ రికార్డుకు చాలా దూరంలోనే ఆగిపోయారు. ఒకప్పుడు ఈ రేసులో లేని జో రూట్, 2021 సంవత్సరం నుంచి తన ఆటతీరును కంప్లీట్‌గా మార్చేశాడు. 2021 లో అతను ఏకంగా 61 యావరేజ్‌తో 1,708 రన్స్ చేసి తన కెరీర్ లోనే బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చాడు. ఆ తర్వాత నుంచి రూట్ సెంచరీల కన్వర్షన్ రేట్ డబుల్ అయింది. కెరీర్ ఫస్ట్ ఫేజ్ లో ప్రతీ 6 మ్యాచులకు ఒక సెంచరీ కొట్టిన రూట్, లాస్ట్ ఐదేళ్లలో ప్రతీ 3.5 మ్యాచులకే ఒక సెంచరీ బాదుతున్నాడు. ఈ మైండ్ బ్లోయింగ్ కన్సిస్టెన్సీ వల్లే సచిన్ రికార్డును రూట్ బ్రేక్ మాత్రమే అని అనలిస్టులు చెప్తున్నారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ లోకి రిషభ్ పంత్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ హిస్టరీలోనే మోస్ట్ సెన్సేషనల్ ప్లేయర్ ట్రేడింగ్ అఫీషియల్ గా కన్ఫర్మ్ అయింది. లక్నో సూపర్ జాయింట్స్ మాజీ కెప్టెన్ రిషభ్ పంత్ మళ్లీ తన పాత ఫ్రాంచైజీ అయిన ఢిల్లీ క్యాపిటల్స్ లోకి రీ-ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ క్రేజీ ట్రేడ్‌కు ఐపీఎల్ గవర్నింగ్ బాడీ జూన్ 23 మంగళవారం అఫీషియల్ మీడియా స్టేట్‌మెంట్ ద్వారా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. "లక్నో సూపర్ జాయింట్స్ మాజీ కెప్టెన్ రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ లోకి వస్తున్నాడు, అతని ప్లేస్ లో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జాయింట్స్ లో జాయిన్ కానున్నాడు" అని ఐపీఎల్ మేనేజ్మెంట్ తెలిపింది. ఈ మెగా డీల్ ఐపీఎల్ సర్కిల్స్ లో ఒక బిగ్గెస్ట్ ఎన్‌కౌంటర్‌గా మారింది. ఈ ట్రేడింగ్ లో రిషభ్ పంత్‌కు భారీగా శాలరీ కట్ (పే కట్) అయింది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో లక్నో సూపర్ జాయింట్స్ రికార్డ్ స్థాయిలో రూ. 27 కోట్లు పెట్టి పంత్‌ను కొనుగోలు చేసింది. ఐపీఎల్ హిస్టరీలోనే అత్యంత కాస్ట్‌లీ ప్లేయర్‌గా నిలిచిన పంత్, ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్ లోకి రావడం కోసం ఏకంగా రూ. 12 కోట్లు వదులుకున్నాడు. కేవలం రూ. 15 కోట్ల రివైజ్డ్ ప్రైస్ తోనే పంత్ ఢిల్లీ జెర్సీ వేసుకోబోతున్నాడు. మరోవైపు కుల్దీప్ యాదవ్ తన ప్రెజెంట్ శాలరీ అయిన రూ. 13.50 కోట్ల సేమ్ ఫీజ్‌తోనే లక్నో సూపర్ జాయింట్స్ లోకి వెళ్తున్నాడు. పంత్ శాలరీ గ్రాఫ్ ఈ రేంజ్ లో పడిపోవడం క్రికెట్ ఫ్యాన్స్ ను బాగా షాక్ కు గురిచేసింది. గత రెండు సీజన్లుగా ఐపీఎల్ లో రిషభ్ పంత్ పర్ఫార్మెన్స్ అస్సలు బాలేదు. లక్నో సూపర్ జాయింట్స్ రూ. 27 కోట్లు పెట్టినా పంత్ ఆ రేంజ్ ఇంపాక్ట్ చూపించలేకపోయాడు. లాస్ట్ రెండు సీజన్లలో కలిపి 28 ఇన్నింగ్స్ ఆడిన పంత్, కేవలం మూడు సార్లు మాత్రమే యాభై కంటే ఎక్కువ రన్స్ స్కోర్ చేయగలిగాడు. ఇందులో ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఐపీఎల్ 2025 లో 24.45 యావరేజ్, 133.16 స్ట్రైక్ రేట్‌తో కేవలం 269 రన్స్ మాత్రమే చేశాడు. 2026 సీజన్ లో కూడా పరిస్థితి పెద్దగా మారలేదు. 28.36 యావరేజ్, 138.05 స్ట్రైక్ రేట్‌తో 312 రన్స్ మాత్రమే స్కోర్ చేశాడు. బ్యాటింగ్ లోనే కాకుండా కెప్టెన్సీ లోనూ ఘోరంగా ఫెయిల్ అయ్యాడు. ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన వెంటనే లక్నో కెప్టెన్సీ నుంచి పంత్ తప్పుకున్నాడు. అయితే మేనేజ్‌మెంట్‌తో వచ్చిన గొడవల వల్లే అతన్ని కెప్టెన్సీ నుంచి సాక్ చేశారనే టాక్ కూడా గట్టిగా నడిచింది. పంత్ బ్యాడ్ ఫామ్ వల్లే లక్నో అతన్ని వదిలించుకోవాలని చూసింది.

# తీవ్ర భావోద్వేగానికి గురైన వైభవ్ సూర్యవంశీ



ఇండియా క్రికెట్ హిస్టరీలో సరికొత్త సంచలనం సృష్టిస్తున్న 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ఇంటర్నేషనల్ కెరీర్ లో బిగ్గెస్ట్ మైలురాయిని అందుకున్నాడు. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు వెళ్లే సీనియర్ టీ20 స్క్వాడ్‌కు అజిత్ అగార్కర్ సెలెక్షన్ కమిటీ వైభవ్‌ను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. జూన్ 26 నుంచి ఐర్లాండ్ సిరీస్ స్టార్ట్ అవ్వబోతుండగా, హోటల్ రూమ్‌లో వైభవ్‌కు టీమిండియా అఫీషియల్ జెర్సీని అందజేశారు. దీనికి సంబంధించిన ఎమోషనల్ వీడియోను బీసీసీఐ తన అఫీషియల్ హ్యాండిల్‌లో షేర్ చేసింది. టీమ్ ప్రసిద్ధ త్రోడౌన్ స్పెషలిస్ట్ రఘు స్వయంగా వైభవ్ రూమ్‌కు వెళ్లి కిట్ బాక్స్ ఇచ్చాడు. రఘును చూడగానే వైభవ్ ఎంతో వినయంగా అతని పాదాలకు నమస్కరించి బ్లెస్సింగ్స్ తీసుకోవడం ఫ్యాన్స్ మనసులను గెలుచుకుంది. జెర్సీని చేతిలోకి తీసుకున్న తర్వాత వైభవ్ సూర్యవంశీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. "నిజంగా ఈ అనుభూతిని చెప్పడానికి మాటలు రావడం లేదు. ఏ కల కోసమైతే నేను ఫస్ట్ డే బ్యాట్ పట్టుకుని ప్రాక్టీస్ కోసం క్రికెట్ గ్రౌండ్‌కు వెళ్లానో, ఆ డ్రీమ్ ఈరోజు నెరవేరింది. నా లైఫ్ లో మోస్ట్ ఇంపార్టెంట్ స్టెప్ కంప్లీట్ అయింది. ఇది ఒక కలలా అనిపిస్తోంది. ఆ బ్లూ టీషర్ట్ పై నా పేరు చూడగానే ముఖంలో నవ్వు ఆపుకోలేకపోయా. కొన్నిసార్లు మనం అస్సలు ఊహించని అద్భుతాలు మన లైఫ్ లో జరుగుతాయి, అవి నిజమైనప్పుడు ఎలా రియాక్ట్ అవ్వాలో కూడా అర్థం కాదు. నా సిట్యుయేషన్ కూడా ప్రెజెంట్ అలాగే ఉంది" అని వైభవ్ ఎమోషనల్ గా చెప్పాడు. ఈ సిరీస్ లో వైభవ్ సూర్యవంశీకి నంబర్ 3 జెర్సీని కేటాయించారు. గతంలో ఇండియా లెజెండ్స్ అయిన హర్భజన్ సింగ్, సురేష్ రైనా లాంటి స్టార్స్ ఈ నంబర్ జెర్సీతోనే మైదానంలో అదరగొట్టారు. ప్రొఫెషనల్ కెరీర్ స్టార్టింగ్ లో నంబర్ 12 జెర్సీ వేసుకున్న వైభవ్, తన తల్లి సలహా మేరకే నంబర్ 3 కి చేంజ్ అయ్యాడు. 12 లో ఉన్న అంకెలను ప్లస్ చేస్తే (1ం2) మూడు వస్తుందని, అలాంటప్పుడు డైరెక్ట్‌గా నంబర్ 3 ఎందుకు తీసుకోకూడదు అని అతని తల్లి చెప్పిన మ్యాథ్స్ ఈక్వేషన్ వైభవ్‌కు బాగా లక్ కలిసి వచ్చేలా చేసింది. ఐపీఎల్ లో రికార్డ్ రన్స్ తో ఆరెంజ్ క్యాప్ గెలిచిన ఈ యంగ్ ఓపెనర్, అదే నంబర్ 3 జెర్సీతో ఇండియా సీనియర్ టీమ్ లో సత్తా చాటాలని చూస్తున్నాడు. ఇండియా సీనియర్ టీ20 స్క్వాడ్‌లోకి ఎంట్రీ దక్కినప్పటికీ, ప్లేయింగ్ ఎలెవన్ లో ఓపెనర్‌గా గ్రౌండ్ లోకి దిగడం వైభవ్‌కు అంత ఈజీ కాదు.



# చరిత్ర సృష్టించిన లియోనెల్ మెస్సీ..

లియోనెల్ మెస్సీ ఫుట్‌బాల్ చరిత్రలో మరో అద్భుత మైలురాయిని అందుకున్నాడు. జూన్ 22, 2026న ఫిఫా వరల్డ్ కప్ 2026 గ్రూప్ జెలో ఆస్ట్రియాతో జరిగిన మ్యాచ్‌లో అర్జెంటీనా కెప్టెన్ రెండు గోల్స్ కొట్టి పురుషుల వరల్డ్ కప్ ఆల్ టైమ్ అత్యధిక గోల్స్ రికార్డును బద్దలు చేశాడు. ఇంతకుముందు జర్మనీ లెజెండ్ మిరోస్లావ్ క్లోజ్ 16 గోల్స్‌తో రికార్డు సృష్టించాడు. మెస్సీ ఈ మ్యాచ్‌లో 17వ గోల్‌తో ఆ రికార్డును సమం చేసి, 18వ గోల్‌తో దాటేశాడు. మ్యాచ్ డల్లాస్‌లోని స్టేడియంలో జరిగింది. మెస్సీ తొలుత పెనాల్టీ కిక్ మిస్ చేశాడు కానీ 38వ నిమిషంలో ఫకుండో మెడినా పాస్‌ను లెఫ్ట్ ఫుట్‌తో అందుకుని అద్భుత గోల్ చేశాడు. ఇది అతని 17వ వరల్డ్ కప్ గోల్. అప్పటికే అల్జీరియాపై హ్యాట్రిక్‌తో 16 గోల్స్ సాధించి క్లోజ్‌ను సమం చేశాడు. ఇన్జ్యూరీ టైమ్‌లో (90ం5') మరో గోల్ చేసి రికార్డును తనదిగా చేసుకున్నాడు. అర్జెంటీనా 2-0తో విజయం సాధించి నాకౌట్ స్టేజ్‌కు అర్హత సాధించింది. ఈ విజయంతో మెస్సీ వరల్డ్ కప్‌లో అత్యధిక విజయాలు, అత్యధిక మ్యాచ్‌లు, అత్యధిక నిమిషాలు వంటి ఇతర రికార్డులను కూడా విస్తరించాడు. మెస్సీ ఈ టోర్నమెంట్‌లో ఇప్పటికే 5 గోల్స్ చేశాడు. అతను 6వ వరల్డ్ కప్ ఆడుతున్న మొదటి ఆటగాడు.

# భారత్‌తో టీ20 సిరీస్‌కు ఇంగ్లాండ్ జట్టు ప్రకటన..

భారత్‌తో జులై 1 నుంచి జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం హ్యారీ బ్రూక్ సారథ్యంలో 17 మందితో కూడిన జట్టును ఇంగ్లాండ్ ప్రకటించింది. ఈ జట్టులో యువ ఆల్‌రౌండర్ జేమ్స్ కోల్స్‌కు తొలిసారి అవకాశం దక్కగా.. సకిబ్ మహమూద్, జోర్డాన్ కాక్స్ పునరాగమనం చేశారు. పేలవ ఫామ్‌లో ఉన్న సీనియర్ ప్లేయర్ జోస్ బట్లర్‌కు సెలక్టర్లు మరో అవకాశం ఇచ్చారు. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలోని యువ భారత జట్టు ఈ సిరీస్‌లో ఇంగ్లాండ్‌ను ఢీకొట్టబోతోంది. భారత్‌తో జరగనున్న టీ20 సిరీస్ కోసం ఆతిథ్య ఇంగ్లాండ్ తమ జట్టును ప్రకటించింది. జులై 1వ తేదీ నుంచే ఇరు జట్ల మధ్య ఇంగ్లాండ్ వేదికగా ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. ఇందుకోసం ఇప్పటికే టీమిండియా తమ జట్టును ప్రకటించగా.. తాజాగా ఇంగ్లాండ్ సైతం స్క్వాడ్‌ను ప్రకటించింది. హ్యారీ బ్రూక్ సారథిగా ఇంగ్లాండ్ వేల్స్ బోర్డు 17 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేసింది. ఇంగ్లాండ్ జట్టులో ఓపెనర్ బెన్ డకెట్‌పై వేటు పడగా.. సకీబ్ మహమూద్, జోర్డన్ కాక్స్, బేకర్ తిరిగి స్క్వాడ్‌లోకి వచ్చారు. జేమ్స్ కొలెస్ తొలిసారి టీ20లకు ఎంపికయ్యాడు. టీ20 ప్రపంచకప్ 2026తో పాటు.. ఐపీఎల్ 2026లోనూ పెద్దగా రాణించలేకపోయిన జోస్ బట్లర్‌పై సెలక్టర్లు నమ్మకం ఉంచారు. అతడితో పాటు ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, జోఫ్రా ఆర్చర్, టామ్ బాంటన్, సామ్ కర్రన్ లాంటి సీనియర్లకు సైతం ఈ జట్టులో చోటు దక్కింది. యంగ్ ప్లేయర్లు జాకబ్ బెథెల్, విల్ జాక్స్, జోష్ టంగ్ తమ స్థానాలను నిలుపుకున్నారు.

# నాకౌట్‌లోకి అడుగుపెట్టిన ఫ్రాన్స్



ఫిఫా ప్రపంచకప్‌లో రెండు సార్లు ఛాంపియన్ అయిన ఫ్రాన్స్ మళ్లీ కప్పు కొట్టేందుకు దూసుకెళ్తోంది. స్టార్ ఆటగాడు కిలియన్ ఎంబాపె మరోసారి డబుల్ గోల్స్‌తో మెరవడంతో ఇరాక్‌పై ఈ జట్టు 3-0తో విజయం సాధించింది. ఫలితంగా నాకౌట్‌లోకి అడుగుపెట్టింది. ఫ్రాన్స్ తరపున ఔస్మనె డెంబెలె మరో గోల్ చేశాడు. అటు 27 ఏళ్ల ఎంబాపెకుఇది 100వ అంతర్జాతీయ మ్యాచ్. వర్షం కారణంగా ఆలస్యంగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఎంబాపె 14, 54వ నిమిషాల వద్ద రెండు గోల్స్ చేసి జట్టుకు విజయాన్ని అందించాడు. ఈ క్రమంలోనే సరికొత్త ఘనత సాధించాడు. మూడోసారి ఫిఫా వరల్డ్‌కప్ ఆడుతున్న ఎంబాపె ఈ టోర్నీలో అత్యధిక గోల్స్ చేసిన రెండో ఆటగాడిగా రికార్డ్ సృష్టించాడు. జర్మనీకి చెందిన మిరస్లావ్ క్లోజ్ (16) రికార్డును సమం చేశాడు. ఫిఫా ప్రపంచ కప్?లో భాగంగా జరిగిన మరో మ్యాచ్?లో సెనెగల్‌పై 3-2 తేడాతో నార్వే విజయం సాధించింది. ఫలితంగా నార్వే రౌండ్ ఆఫ్ 32కు దూసుకెళ్లింది. హాలాండ్ తన అద్భుతమైన గోల్స్ పరంపరను 48, 58వ నిమిషాల్లో కొనసాగించి నార్వే గెలిచేలా చేశాడు.

ప్రజావీక్షణం
దినపత్రిక



## మా ఇంటి బంగారాన్ని అభినందించిన మెగాస్టార్


స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదలైన తర్వాత మంచి స్పందనను అందుకుంటోంది. దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహం అనంతరం సమంత నటించిన తొలి సినిమా కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. జూన్ 19న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి వసూళ్లను నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సమంత, రాజ్ నిడిమోరు దంపతులతో పాటు దర్శకురాలు నందిని రెడ్డి, చిత్ర యూనిట్ సభ్యులను తన నివాసానికి ఆహ్వానించిన ఆయన, సినిమా విజయంపై శుభాకాంక్షలు తెలిపారు. సినిమా చూసిన అనంతరం చిరంజీవి తన అభిప్రాయాన్ని పంచుకుంటూ, మా ఇంటి బంగారం చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఉమ్మడి కుటుంబం నేపథ్యంలో యాక్షన్, భావోద్వేగాలను అందంగా మేళవిస్తూ దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో వినోదాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు అని పేర్కొన్నారు. అలాగే సమంత నటనను ప్రత్యేకంగా ప్రశంసించిన ఆయన, సమంత నటన అద్భుతంగా ఉంది. ముఖ్యంగా చీరకట్టులో ఆమె చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇటువంటి మహిళా ప్రాధాన్య చిత్రాలు తెలుగు సినీ పరిశ్రమకు అవసరం. ఈ విజయానికి సమంత, నందిని రెడ్డి, రాజ్ మరియు మొత్తం చిత్ర బృందానికి హృదయపూర్వక అభినందనలు అని తెలిపారు. మరోవైపు జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తున్న సమంత, రాజ్ దంపతులకు ప్రత్యేక అభినందనలు అని ఆయన పేర్కొన్నారు. చిరంజీవి సతీమణి సురేఖ సమంత దంపతులకు కొత్త బట్టలు పెట్టి ఆశీర్వదించారు. ఈ కామెంట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసింది. ముఖ్యంగా 'కొత్త అధ్యాయం' అనే పదం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. దీనిపై సోషల్ మీడియాలో పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. సమంత ప్రెగ్నెన్సీ విషయంలో చిరు ఈ కామెంట్ చేశారా అని పలువురు ముచ్చటించుకుంటున్నారు. ఇక జూన్ 19న విడుదలైన 'మా ఇంటి బంగారం' మొదటి రోజునుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంది. ముఖ్యంగా సమంత నటన, భావోద్వేగ సన్నివేశాలు, కుటుంబ నేపథ్యం, యాక్షన్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

## బాహుబలి: ది ఎటర్నల్ వార్
## కీలక అప్‌డేట్‌ను అందించిన ప్రభాస్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు మరో సర్‌ప్రైజ్ అందించారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న కొత్త యానిమేషన్ ప్రాజెక్ట్ 'బాహుబలి: ది ఎటర్నల్ వార్'కు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను ప్రభాస్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ అభిమానుల్లో భారీ ఆసక్తిని పెంచారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యానిమేషన్ రూపంలో ప్రభాస్ యోధుడి అవతారంలో కనిపించడం అభిమానులకు గూస్‌బంప్స్ కలిగిస్తోంది. 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక యానిమేషన్ ఉత్సవాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఫ్రాన్స్‌లోని 'అన్నెసీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026'లో 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' ఎంపిక కావడం భారతీయ సినీ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. ఈ ఫెస్టివల్‌లో నిర్వహించే 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' సెషన్‌లో ఈ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా యానిమేషన్ రంగానికి చెందిన ప్రముఖులు, స్టూడియోలు, నిర్మాతలు, దర్శకుల సమక్షంలో ఈ ప్రాజెక్ట్ ప్రదర్శించబడనుండటం విశేషం.

## వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ

ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు. 'బాహుబలి' తర్వాత ఆయన క్రేజ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించగా, ప్రతి సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఏడాది విడుదలైన 'రాజా సాబ్' సినిమా మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఇదిలా ఉంటే, దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 చివర్లో విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం 'ఫౌజీ' 2027లో విడుదలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే ఇప్పుడు ప్రభాస్ అభిమానులకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది. ఎందుకంటే 2027లో ప్రభాస్ నుంచి ఏకంగా మూడు భారీ ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. మరోవైపు 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చే యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' కూడా 2027లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ ప్రాజెక్ట్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో 'ఫౌజీ' కూడా అదే ఏడాదిలో విడుదలైతే, ప్రభాస్ అభిమానులకు ఒకే ఏడాదిలో మూడు భారీ ట్రీట్స్ లభించినట్లవుతుంది. దీంతో 2027ను ఇప్పటికే అభిమానులు 'ప్రభాస్ నామ సంవత్సరం'గా అభివర్ణిస్తున్నారు. భిన్నమైన కథలు, భారీ స్థాయి నిర్మాణ విలువలు, పాన్ ఇండియా మార్కెట్‌లో ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా 'స్పిరిట్', 'ఫౌజీ', 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' చిత్రాలు ఒకే ఏడాదిలో విడుదలైతే భారతీయ సినీ పరిశ్రమలోనే అరుదైన రికార్డులు నమోదయ్యే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు అభిమానుల దృష్టి మొత్తం ఈ ప్రాజెక్ట్‌ల అధికారిక విడుదల తేదీలపైనే ఉంది.




## ఆదర్శకుటుంబం ఆలస్యం అవుతోందా ?

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న క్రేజీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47. సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు ఇటీవల వార్తలు వినిపించాయి. కానీ పరిస్థితులు చూస్తుంటే అందుకు అనుగుణంగా లేవు అనే టాక్ వినిపిస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఈ సినిమా విడుదలపై ఒక షాకింగ్ గాసిప్ గట్టిగా వినిపిస్తోంది. ఈ మోస్ట్ అవేటెడ్ మూవీ అనుకున్న సమయానికి రావడం లేదని వాయిదా పడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని టాక్ నడుస్తోంది. ఈ సినిమా షూటింగ్ లో కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయని, కొన్ని సీన్స్ రీ షూట్ చేస్తున్నారని అక్టోబర్ 2లు షూటింగ్ ఫినిష్ అయ్యే అవకాశం లేదని టాక్. ఒకవేళ ఈ అక్టోబర్ లాంగ్ వీకెండ్ డేట్‌ను గనుక మేకర్స్ మిస్ చేసుకుంటే.. ఆ తర్వాత ఈ ఏడాదిలో సరైన విండో దొరకడం కష్టమేనని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే జరిగితే, 'ఎకె 47' చిత్రాన్ని ఏకంగా 2027 సమ్మర్ సీజన్‌కు మాత్రమే పోస్ట్‌పోన్ చేసే అవకాశాలు ఉన్నట్లు గట్టిగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ గాసిప్స్ పై ప్రొడక్షన్ హౌస్ నుండి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు అలాగే ఖండించలేదు. దీంతో వెంకీ ఫ్యాన్స్ కాస్త కంగారు పడుతున్నారు.







## పెద్ది తరవాత బుచ్చిబాబులో మార్పు
## కొత్త సినిమా కోసం వేగం పెంచాలని నిర్ణయం

టాలీవుడ్‌లో దర్శకుడు బుచ్చిబాబు సాన గురించి మాట్లాడినప్పుడు ముందుగా గుర్తుకొచ్చేది ఆయన కథలపై చూపించే నిబద్ధత. ఒక సినిమా పూర్తయిన వెంటనే మరో ప్రాజెక్ట్‌ను ప్రారంభించే దర్శకుల కంటే, కథను పూర్తిగా సిద్ధం చేసి, ప్రతి అంశాన్ని పక్కాగా మలిచిన తర్వాతే సెట్స్‌పైకి తీసుకెళ్లే దర్శకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే ఇప్పుడు బుచ్చిబాబు తన పని విధానంలో కీలకమైన మార్పుకు సిద్ధమవుతున్నారనే చర్చ ఇండస్ట్రీలో జోరుగా సాగుతోంది. 'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా అద్భుతమైన అరంగేట్రం చేసిన బుచ్చిబాబు తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్నారు. అయితే ఆ సినిమా తర్వాత వెంటనే కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించకుండా, తన రెండో చిత్రానికి అవసరమైన కథ, పాత్రలు, ప్రీ-ప్రొడక్షన్ పనులపై చాలా సమయం కేటాయించారు. దీంతో 'ఉప్పెన' తర్వాత ఆయన తదుపరి చిత్రం కోసం అభిమానులు, సినీ పరిశ్రమ దాదాపు కొన్ని సంవత్సరాలు ఎదురుచూడాల్సి వచ్చింది. చివరకు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని అందుకుంది. 'పెద్ది' విజయం బుచ్చిబాబు కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలిచింది. గ్రామీణ నేపథ్యం, భావోద్వేగాలతో కూడిన కథనం, పాత్రల రూపకల్పన, విజువల్ ట్రీట్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆయన కథ చెప్పే తీరు, భావోద్వేగాలను తెరపై ఆవిష్కరించే విధానానికి విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభించాయి. గతంతో పోలిస్తే చాలా తక్కువ సమయంలోనే తన తదుపరి సినిమాను ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లో పోటీ తీవ్రంగా పెరిగింది. ఒక దర్శకుడు వరుస విజయాలను కొనసాగించాలంటే తక్కువ వ్యవధిలోనే కొత్త ప్రాజెక్ట్‌లను ప్రకటించడం కూడా కీలకంగా మారింది. ఈ విషయాన్ని బుచ్చిబాబు కూడా గుర్తించినట్లు కనిపిస్తోంది. అందుకే ఈసారి కథా రచన, ప్రీ-ప్రొడక్షన్ ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి తదుపరి సినిమాను త్వరగా పట్టాలెక్కించాలని ఆయన భావిస్తున్నారని సమాచారం.



## వారసత్వం ఉన్నా...కష్టపడితేనే ఫలితం
### ప్రేక్షకులు ఊరికే ఆదరిస్తానుకోరాదు నటుడు రామ్ చరణ్

సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. ప్రేక్షకులు ఎప్పుడూ నటుడి నటను చూసే ఆదరిస్తారని రామ్ చరణ్ అన్నారు. తాజాగా ఆయన 'రిపబ్లిక్ సమ్మిట్'లో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిజినెస్ భాషలో చెప్పాలంటే.. 'పెద్ది' సినిమా తన కెరీర్‌కు బెస్ట్ 'స్టార్టప్' లాంటిదని వెల్లడించారు. నా చిన్నప్పుడు దర్శకులు, నిర్మాతలు 'మీ నాన్న కంటే బాగా చేయాలి' అని చెప్పినప్పుడు బాధ్యతగా అనిపించేది. నేను ఆ ఒత్తిడిని పెద్దగా పట్టించుకోలేదు. మా నాన్న ఇంట్లో సరదాగా ఉంటారు. మా డైనింగ్ టేబుల్ మీద సినిమా చర్చలు, స్టార్డమ్ ముచ్చట్లు ఎప్పుడూ రానిచ్చేవారు కాదు. సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడం వల్ల త్వరగా ఒక మంచి వేదిక దొరుకుతుందనేది నిజమే.. కానీ, ప్రేక్షకులు మనల్ని ఎవరి వారసుడు అని చూడరు.. మొదటి సినిమా తర్వాత కేవలం మన కష్టం, నిజాయతీ మాత్రమే చూస్తారు. నా 15 ఏళ్ల కెరీర్‌లో ఆయన నాకు ఎప్పుడూ నటన పరంగా ఫీడ్‌బ్యాక్ ఇవ్వలేదు. నన్ను వేలు పట్టి నడిపించలేదు. కానీ క్రమశిక్షణ విషయంలో ఆయనే నాకు స్ఫూర్తి అని చెప్పారు.ఓటీటీల ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. థియేటర్లు, ఓటీటీలు రెండూ ఒకదానికొకటి సాయం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'ఆర్ఆర్ఆర్' థియేటర్లలో విడుదలైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చింది. దానివల్ల పాశ్చాత్య దేశాల ప్రజలకు కూడా సినిమా చేరి, ఆస్కార్ నామినేషన్ వరకు వెళ్లేలా క్రేజ్ పెరిగింది.



Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com